RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 17 శనివారం, ఫిబ్రవరి 10, 2024 పేజీలు : 4

## ఎమ్మెల్సీల నియామకాలపై స్టేటస్ కో పొడిగింపు

హైదరాబాద్ : గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకపు అమలును నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు గురువారం మరోసారి పొడిగించింది. తుది ఉత్తర్వులు వెలువడే వరకు గత నెల 30న వెలువరించిన మధ్యంతర స్టేటస్ కో ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ కేసులో కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ప్రతివాదులుగా చేర్చుతూ దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లను హైకోర్టు అనుమతించింది.

# మన పివి భారత 'రత్నం'

**న్యూఢిల్లీ ఫిబ్రవరి, 9 :** కేంద్రప్రభుత్వం మరోసారి 'భారత రత్న'పురస్కారాలను ప్రకటించింది. మాజీ ప్రధానులు పివి నరసింహారావు, చరణ్ సింగ్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం ఎస్ స్వామినాథన్‌లను అత్యున్నత పౌర పురస్కారాలతో సత్కరించింది. ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఎక్స్( ట్విట్టర్) వేదికగా ఈ మేరకు ప్రకటించారు. దేశానికి వీరు అందించిన సేవలను కొనియాడారు. తాజా ప్రకటనతో ఈ ఏడాది మొత్తం అయిదుగురిని ఈ అత్యున్నత పురస్కారం వరించింది. మోడీ ప్రభుత్వం ఇంతకు ముం దు బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీ, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌లకు భారత రత్న ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఒకే ఏడాది ఇంత మందికి భారత రత్న ప్రకటించడం ఇదే మొదటిసారి. 1999లో అప్పటి వాజపేయి ప్రభుత్వం నలగురికి భారత రత్న ప్రకటించింది. పివి నరసింహారావు, చరణ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్‌లకు భారత రత్నను ప్రకటిస్తూ ప్రధాని మోడీ దేశానికి వారు అందించిన సేవలను కొనియాడారు.' రాజనీతిజ్ఞుడు పివి నరసింహారావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఆయన చేసిన సేవ చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పివి హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం దేశాన్ని సాంస్కృతికంగా, మేధిపరంగా సుసంపన్నం చేసింది' అని ప్రధా ని కొనియాడారు. మాజీ ప్రధాని చరణ్ సింగ్, స్వామినాథన్‌ల కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



# ఆన్‌లైన్ సమ్మక్క - సారక్కలకు బంగారం సమర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ ఫిబ్రవరి, 9 :** మేడారం సమ్మక్క – సారక్కలకు ఆన్‌లైన్ ద్వారా నిలువెత్తు బంగారం సమర్పించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ,ఎంఎల్‌ఎలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం తన మనవడు రియాన్ష్ నిలువెత్తు బంగారం ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మనవరాలి నిలువెత్తు బంగారం ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల కోసం అమ్మవార్లకు ఆన్‌లైన్‌లో నిలువెత్తు బంగారాన్ని సమర్పించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది.

**ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ పోస్టర్ ఆవిష్కరణ**

మేడారం మహాజాతరలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ, జాతరను పరిశుభ్రంగా స్వచ్ఛంగా జరుపుకోవాలని కోరుతూ శుక్రవారం అసెంబ్లీ కమిటి హాలులో సిఎం రేవంత్ రెడ్డితో కలిసి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, సీతక్క, సిఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలించి ప్రజల సంక్షేమం విస్మరించాయి

హైదరాబాద్: రాష్ట్రాన్ని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పాలించి ప్రజల సంక్షేమం పూర్తిగా విస్మరించాయని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన ప్రజలకు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈసందర్భంగా గత 10 ఏళ్ల బిఆర్ఎస్ అధికారంలో ఉన్న ప్రజా బాగోగులు మరిచి, సొంత దందాలకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రాన్ని 50 ఏళ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కనీస మౌలిక వసతులు కల్పించలేదని పేర్కొన్నారు. రెండు పార్టీల్లో కుటుంబ పాలన స్పష్టంగా కనిపిస్తుందని, తమ తప్పులు బయటపడకుండా ఇతర పార్టీలను కుటుంబ పార్టీలని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు చరమగీతం పాడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న నరేంద్ర మోడీ సారథ్యంలోని బిజెపి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అబ్ కీ బార్ 400 పార్ అనే నినాదంతో మోడీ సర్కార్ మూడోసారి అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. రెట్టింపు ఉత్సాహంతో మరోసారి కరీంనగర్ నుంచి లోక్‌సభకు పోటీ చేసేందుకు సిద్ధమయ్యానని నియోజకవర్గం ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.



# ఆటో డ్రైవర్లకు రేవంత్ సర్కారు అభయహస్తం

**హైదరాబాద్ ఫిబ్రవరి, 9 :** రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్‌ప్రభుత్వం అభయం ఇచ్చింది. ప్రతిఏటా ఆటోడ్రైర్లకు రూ. 12వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్టు రాష్ట్ర శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మాన కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. తద్వారా మహిళలకు రూ. 13,600కోట్లు ప్రజాధనం అందజేసినట్టవుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకు అనుకూలమా లేక వ్యతిరేకమా? తెలపాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల సమస్యలు కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రగతిని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటులో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఐటి పరిశ్రమ రంగాన్ని పది రెట్లు పెంచుతామన్నారు. ఎంఎస్ఎంఇపై త్వరలోనే పాలసీని తీసుకురానున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్ని ఉన్నా రాష్ట్ర ప్రగతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యం అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్ చూశాక ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కూడా ఉండదని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.



# ముగ్గురు ప్రముఖులకు భారత రత్న ఇవ్వడం దేశానికి గర్వకారణం

**హైదరాబాద్ ఫిబ్రవరి, 9 :** మాజీ ప్రధానులు పివి నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌లకు కేంద్రప్రభుత్వం భారత అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం హర్షనీయమని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. బలమైన భారతదేశాన్ని నిర్మించడంలో వారు చేసిన అమూల్యమైన సేవలకు ఇదే నిజమైన గుర్తింపుగా భావిస్తూ స్వాగతిస్తున్నామని, ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర శాఖ తరుపున ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ స్వాతంత్ర్య కోసం నిజాంపై పోరాడిన పోరాట యోధుడిగా నిలవడమే కాకుండా దేశంలో ఆర్థిక సంస్కరణలకు పునాదులు వేసిన పివికి భారతరత్నతో గౌరవించడం మరువలేమన్నారు. మరో మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు కూడా భారత రత్న ఇచ్చి గౌరవించుకోవడం గర్వకారణమని, రైతుల సంక్షేమం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారు. ఒక ఎమ్మెల్యేగా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర హోంమంత్రిగా పని చేసిన దేశ అభివృద్ధికే ప్రాధాన్యం ఇచ్చారని ప్రశంసించారు. భారత హరిత విప్లవ పితామహుడుగా గౌరవించబడిన డా.స్వామినాథన్ మార్గదర్శక కృషి దేశం వ్యవసాయ భూభాగాన్ని పునర్నిర్మించడమే కాకుండా ఆహార కొరతతో పోరాడటానికి శాస్త్రీయ నైపుణ్యం, అంకితభావానికి శాశ్వత ఉదాహరణగా నిలిచారని పేర్కొన్నారు. దేశానికే కాకుండా ప్రపంచానికి అత్యున్నత సేవలందించిన మహానుభావులకు భారతరత్నతో గౌరవించుకోవడం నిజమైన గౌరవమన్నారు. మోడీ ప్రభుత్వం ఎటువంటి సిఫార్సులు లేకుండా అసలైన రత్నాలకు భారతరత్నతో గౌరవించడాన్ని స్వాగతిస్తూ పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వేడుకలు జరిపేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. బిజెపి శ్రేణులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రధాని మోడీకి మద్దతు పలకాలి

**హైదరాబాద్ ఫిబ్రవరి, 9 :** రాష్ట్రంలో బిఆర్ఎస్ కార్యకర్తలు, దేశ ప్రయోజనాల దృష్ట్యా మోడీ నాయకత్వాన్ని బలపరచాలని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కోరారు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీ దేశ రాజకీయాల్లో అసందర్భంగా మారిందని, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఆ పార్టీ కార్యాలయాలకు తాళం వేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో కూడా అదే పరిస్థితి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఎన్నికల ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలను, అభ్యర్థుల ఎంపికపై పార్టీ నిర్వహించిన ఎన్నికల సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. కార్యకర్తల నుంచి ఎంపీ అభ్యర్థులకు సంబంధించి వివరాలు సేకరించామని, ఎక్కువగా పోటీ ఉండే స్థానాలకు సంబంధించిన అభ్యర్థులు జాబితా సిద్దం చేసినట్లు త్వరలోనే అభ్యర్థుల ప్రకటన ఉంటుందన్నారు. తమ పార్టీ ప్రకటించే మొదటి జాబితాలో తెలంగాణ సీట్లు కూడా ఉంటాయని, రాష్ట్రంలో 17 సీట్లలో పోటీ చేసి మెజార్టీ సీట్లు గెలుస్తామన్నారు. తెలంగాణలో బిజెపికి గెలిచేందుకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. ప్రజలనుంచి సానుకూల స్పందన కనబడుతోందని, ప్రతిపక్షాలు నైరాశ్యంగా ఉన్నాయన్నారు. వారి భవిష్యత్తు అంధకారంలో కనబడుతుందన్నారు. అదే విధంగా రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో చేరికల పై దృష్టి పెట్టామని, పిఎం మోడీ పార్లమెంట్ ఉభయ సభల్లో కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాలకు వ్యతిరేకమనే విషయాన్ని వివరించారన్నారు. రిజర్వేషన్లను నెహ్రూ అడ్డుకున్న విషయాన్ని బట్టబయలు చేశారని తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బిసి రిజర్వేషన్లకు నెహ్రూ వ్యతిరేకించారని, కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోయిందని మండిపడ్డారు. మోడీ కులంపై ఇప్పుడు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ కులంపై రాహుల్ తప్పుడు వాఖ్యలు, అసంబద్ధ వాఖ్యలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మోడీ ముఖ్యమంత్రి అయ్యాక ఓబీసీలో ఆయన కులం చేరింది అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోడీతో పాటూ ఓబీసీ సమాజానికి రాహుల్ క్షమాపణ చెప్పాలన్నారు. బీజేపీ కులగణనను ఎక్కడా అడ్డుకోలేదన్నారు.



# శివబాలకృష్ణ బెయిల్ పిటీషన్‌పై సోమవారం తీర్పు



హైదరాబాద్ : హెచ్ఎండిఎ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ బెయిల్ పిటిషన్ పై నాంపల్లి ఎసిబి కోర్టు విచారణ నిర్వహించింది. శివ బాలకృష్ణను ఎసిబికి ఇచ్చిన 8 రోజులు కస్టడీ పూర్తయ్యిందని బెయిల్ మంజూరు చెయ్యాలని శివబాలకృష్ణ తరపు న్యాయవాది కోర్టును కోరారు. శివ బాలకృష్ణకు బెయిల్ మంజూరు చెయ్యొద్దని ఎసిబి తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఇరు వాదనలు విన్న ధర్మాసనం బెయిల్ పిటిషన్ పై వచ్చే సోమవారం తీర్పు ప్రకటించనుంది. ఎసిబి విచారణలో శివ బాలకృష్ణ గురించి సంచలన విషయాలు బయటపడ్డాయి. శివబాలకృష్ణ వద్ద రూ. 250 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తించారు. 214 ఎకరాల భూమి, 29 ప్లాట్లు బినామీల పేర్లపై ఉన్నాయని అధికారులు గుర్తించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్లాట్లు ఉన్నట్టు గుర్తించారు.

# ది వీడీ బ్లాక్‌హాక్స్ బ్లాక్ హాక్స్ ఓపెన్ 24





**హైదరాబాద్, ఫిబ్రవరి 9:**
రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఆధ్వర్యంలో అతిపెద్ద టోర్నీగా జరుగుతున్న 'ది వీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్ 24 టోర్నమెంట్(ఫైనల్)ను' ప్రకటించబోతున్నాం.వీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్‌కు రూపే అధికారిక స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నది. ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్)లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ప్రొఫెషనల్ వాలీబాల్ టీమ్‌గా పోటీపడుతున్నది. అయితే భారత దేశ టాప్ వాలీబాల్ టోర్నీ ద్వారా ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకురావడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ప్లేయర్లను మరింతగా సానబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హావీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్‌పై హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ సహ యజమాని విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ప్రైమ్ వాలీబాల్ లీగ్ ప్రయాణంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో హెూముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన ప్లేయర్లను గుర్తించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. రెండు రాష్ట్రాల్లో హెూదాదాపు 16 సిటీల్లో వీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్ 24 టోర్నీ ద్వారా వాలీబాల్‌ను క్షేత్ర స్థాయిలో మరింతగా ప్రమోట్ చేస్తున్నాం. దీనికి తోడు ఆటను మరింత విస్తరించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంలో ఫైనల్లో తలపడే జట్లకు అభినందనలు తెలుపుతున్నాను". తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 16 సిటీల నుంచి మొత్తం 307 జట్లు టోర్నీలో పోటీపడబోతున్నాయి. ఇందులో 3,200 మంది ప్లేయర్లు, కోచ్‌లు ఉంటారు. టోర్నీ మొత్తమ్మీద 15000 మంది అభిమానులు ఇందులో భాగమవుతారు. ఈ కింద జిల్లాల నుంచి టోర్నీలో పోటీపడేందుకు ప్లేయర్లను రెజిస్టర్ అయ్యారు. తెలంగాణ:ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్, వరంగల్. ఆంధ్రప్రదేశ్: గుంటూరు, విజయవాడ, నెల్లూరు, కడప, రాజమండ్రి, కర్నూల్, విశాఖపట్నం, ఏలూరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్ 24 అనేది తొలి టోర్నీ. దీని ద్వారా వాలీబాల్‌ను వేలాది మంది పిల్లలు కెరీర్‌గా ఎంచుకోవడంతో పాటు తమ ప్రతిభను చూపించేందుకు అవకాశం లభిస్తుంది. వాలీబాల్‌ను మరింత క్షేత్రస్థాయిలో విస్తరించడానికి తోడు ప్రతిభ ప్లేయర్లను గుర్తించి వారిని సానబట్టడం అన్న హెూప్రధాన ఉద్దేశంతో వీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్ 24 టోర్నీని నిర్వహిస్తున్నాం అని హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ప్రిన్సిపల్ ఓనర్ అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సరైన ప్రతిభను గుర్తిస్తూ హెూవారిని మరింత ప్రోత్సహించేందుకు బ్లాక్‌హాక్స్ నిరంతరం ప్రయత్నిస్తుందని అభిషేక్ అన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే జట్లను ఉత్సాహపరిచేందుకు అభిమానులను భారీ సంఖ్యలో ఆహ్వానిస్తున్నాం. టోర్నీలో మొత్తంగా రెండు దశల్లో(జిల్లా స్థాయి, చాంపియన్‌షిప్ స్థాయి) జరుగుతుంది. ఇప్పటికే జిల్లా స్థాయి హెూపోటీలు జనవరి 19-21, 26-28, ఫిబ్రవరి 2-4 తేదీల్లో ముగిశాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 10, 11 తేదీల్లో చాంపియన్‌షిప్ తుది పోటీలు జరుగుతాయి. టోర్నీలో పోటీపడి అద్భుత ప్రదర్శన కనబరిచిన వారికి బ్లాక్‌హాక్స్ తగిన రీతిలో నగదు ప్రోత్సాహం అందిస్తుంది. చాంపియన్‌షిప్‌లో లెవల్ ప్రైజ్‌మనీ కింద 1 రూపాయాలు, రన్నరప్ జట్టుకు రూ.50,000 అందజేస్తాం. సెమీఫైనల్లో ఓడిన జట్లకు రూ.25000 చొప్పున ఇస్తాం. వీడీ బ్లాక్‌హాక్స్ ఓపెన్ 24 టోర్నీలో గెలిచిన జట్టును హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ టీమ్‌తో శిక్షణ పొందేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 11న జరిగే ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమానికి హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ సహ యజమాని, ప్రముఖ హీరో విజయ్ దేవరకొండ హాజరవుతారు. ఈ సందర్భంగా అభిమానుల కోసం బ్లాక్‌హాక్స్ ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహిస్తున్నారు.

## ప్రత్యేక పారిశుద్ధ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ



**ఏన్కూర్ ఫిబ్రవరి 9:**
ప్రత్యేక పారిశుద్ధ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఆరెం వరలక్ష్మి. ఈనెల 7 నుండి 14 వరకు ప్రత్యేక పారిశుద్ధ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఎన్కూర్ నందు మరియు సైడ్ డ్రెయిన్ పనులను పంచాయతీ కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ ఎంపీడీవో వేణుమాధవ్ ఆదేశాల మేరకు, ఆయన సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరెం వరలక్ష్మి మాట్లాడుతూ... ప్రత్యేక పరిశుద్ధ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించి, అనంతరం సైడ్ డ్రెయిన్ పూడికచేతలను చేయడం జరిగింది అన్నారు. గ్రామ ప్రజలకు కూడా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ జివిఎస్ నారాయణపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ,ఎస్టీ,బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి:జాజుల లింగం గౌడ్



**తార్నాక, ఫిబ్రవరి 9:**
తెలంగాణ లోని ప్రైవేట్ యూనివర్సిటీలో ఫీజుల నియంత్రణ చట్టం తెచ్చి ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈ రోజు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీ లోని అఖిల భారత సాంకేతిక విద్య మండలి లో అధికారులను కలిసి పిర్యాదు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ యూనివర్సిటీలో ఫీజులు నియంత్రణ లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్టు ఫీజులు వసూలు చేస్తున్నారని,అంతే కాకుండా ప్రైవేట్ యూనివర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపరచాలని యూజీసీ నిర్ణయించినా తెలంగాణలోని ప్రైవేట్ యూనివర్సిటీలో రిజర్వేషన్ అమలు చేయడం లేదు.విద్య అనేది సేవా మార్గం అని మరిచి విద్య ముసుగులో తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేస్తూ పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుకు తింటున్నారు.వర్సిటీలో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వలన ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు విద్య అనేది అందని ద్రాక్షగా మారింది.రాష్ట్రంలోని ప్రైవేట్ వర్సిటీలో విద్యార్థులకు సరైన మౌలిక వసతులు అర్హతలు ఉన్న సిబ్బంది లేకుండానే విద్యను అందిస్తున్నాయి.ప్రస్తుతం తెలంగాణలో ప్రైవేట్ యూనివర్సిటీలు ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తూ అడ్మిషన్ల దగ్గర నుంచి ఫీజుల ఖరారు పరీక్షలు నిర్వహన వంటి అనేక అంశాలు సొంత షెడ్యూల్ ని అమలు చేస్తూ పేదవానికి విద్యను అందని ద్రాక్షగా చేశారు. తెలంగాణలోని విద్యార్థులకు న్యాయం జరిగేలా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేసి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. ఈ కార్యక్రమంలో మహేశ్ యాదవ్, వంశీ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి కి మాదిగ విద్యార్థుల పాలాభిషేకం



**తార్నాక, ఫిబ్రవరి 9:**
:ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో వాదనలు జరుగుతున్న కీలక సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాదిని ఏర్పాటుచేసిన సీఎం రేవంత్ రెడ్డి కి, మాదిగ,మాదిగ ఉప కులాల విద్యార్థుల తరఫున ఓయూ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వలిగొండ నర్సింహ మాట్లాడుతూ.. మాదిగ ,మాదిగ ఉపకులాల మూడు దశాబ్దాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ కోసం దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టులో ఏడుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనంలో ఎస్సీ వర్గీకరణ పై వాదనలు జరుగుతున్న కీలక సందర్భంలో,తన రాజకీయ ప్రస్థానంలో ఎల్లప్పుడూ మాదిగలకు, ఎస్సీ వర్గీకరణ పోరాటాలకు బాసటగా నిలిచి, తెలంగాణలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని చేర్చి దానికి అనుగుణంగా సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించడానికి మాజీ సోలిసిటర్ జనరల్ ప్రముఖ న్యాయవాది వివేక్ కృష్ణ దన్ ని ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు ప్రజా నాయకుడు ఎనుముల రేవంత్ రెడ్డి కి మాదిగ మాదిగ ఉపకులాల విద్యార్థుల మేధావుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నాము అని అన్నారు.ఎస్సీ వర్గీకరణ అంశం పై జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మాదిగ ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మాదిగ మాదిగ ఉపకులాల పక్షాన ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టులో జరుగుతున్న వాదనలను పరిశీలిస్తూ కావాల్సిన అంశాలను న్యాయవాదులకు అందించిన గౌరవ ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ కి ప్రత్యేక ధన్యవాదాలు అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ ,వేముల వీరేశం, మందుల స్వామేల్ ,లక్ష్మీనారాయణ,ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ టీపీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, వరంగల్ రవి కి ఇతర మాదిగ కాంగ్రెస్ నాయకులు అందరికీ మాదిగ విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతూ ,మాదిగ విద్యార్థులు మేధావులు అందరూ గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన నిలిచినట్టుగానే రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన మాదిగ మాదిగ ఉప కులాలు, ప్రజాస్వామ్యవాదులు కాంగ్రెస్ వైపు నిలబడేలా, మాదిగ విద్యార్థులే బాధ్యత తీసుకోవాలని ఓయూ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ ఓయూ పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ వలిగొండ నరసింహ ఆర్ట్స్ కాలేజీ వద్ద జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు అంబేద్కర్ ,సురేష్ ,క్రాంతి ప్రశాంత్, విజయ్ ,మంద రాజు, హరి ,సంజు సాయి, పార్థు, పుట్ట రంజిత్ ,అనిల్ ,జింక రాజు ,కొండారెడ్డిపల్లి శేఖర్ ,నక్క వెంకటేష్ , రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని అన్నారు : ఎంపీడీవో చుంచు శ్రీనివాస్



**ఖమ్మం ఫిబ్రవరి 9:**
మండలం లోని పిండిప్రోలు కేశవపురం పైనంపల్లి గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారి ఎంపీడీవో చుంచు శ్రీనివాస్ గ్రామ సభలు నిర్వహించారు ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు గ్రామాల్లోని నిర్వహించబోయే పారిశుద్ధ పనులపై గ్రామ సభల్లో ప్రణాళికలు రూపొందించారు గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి పారిశుద్ధ్య పనులు గుర్తించారు గురువారం గ్రామాల్లోని మురికి కాలువలు సైడ్ డ్రైనేజీలు శుభ్రపరచడం డెంగు దోమల ఫ్రైడే ఫ్రైడే పాటించాలని శనివారం గ్రామాల్లో పాడుబడిన బావులు పనికిరాని బోరుబావులను గుర్తించి వాటిని పూడ్చి వేయడం ఆదివారం ఉపయోగంలో లేని మరుగుదొడ్లను వినియోగించేలా అవగాహన కల్పించడం సోమవారం గ్రే వాటర్ నిర్మూలనకు స్టాక్ ఫీట్లను ఏర్పాటు చేయడం మంగళవారం ఇళ్లలోని మరుగుదొడ్ల వద్ద రెండో గుంతను ఏర్పాటు చేయడం అంటే పనులకు ప్రణాళికలు గ్రామసభల్లో చర్చించారు అలాగే ఈ పనులు కచ్చితంగా జరిగేలా ప్రతిరోజూ చేసిన పనులను ప్రత్యేక అధికారులు పరిశీలించి ఆ ప్రదేశంలో ఉండే ఫోటోలను సంబంధిత అధికారులకు నివేదిక అందజేయాలని తీర్మానించారు ఈ కార్యక్రమం లో గ్రామపంచాయతీ కార్యదర్శి బాలాజీ నాయక్ సిపిఐ ఎంఎల్ ప్రజాపంద మాస్ లైన్ జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి పులుగుజ్జు వెంకటస్వామి సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి పప్పుల ఉపేందర్ రామన బోయిన రవి తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పరికిపల్లి చంద్రశేఖర్ చామకూరి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతి జూనియర్ కళాశాల ప్రాక్టికల్ సెంటర్ ను సందర్శించిన డి ఐ ఈ ఓ రవి బాబు



**వైరా ఫిబ్రవరి 9:**
సైన్స్ ప్రాక్టికల్ పరీక్షల తనిఖీలలో భాగంగా ఖమ్మం జిల్లా వైరాలోని క్రాంతి జూనియర్ కళాశాలను ఉమ్మడి ఖమ్మం జిల్లా డి ఐ ఈ ఓ రవి బాబు గురువారంసందర్శించారు. ఈ సందర్భంగా రవిబాబు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.... విద్యార్థులు సెల్ ఫోన్ లకు ,విభిన్నమైన చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,స్పష్టమైన ప్రణాళిక ద్వారా ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ సబ్జెక్టుకు రూపొందించిన ప్రాక్టికల్స్ రికార్డు అదేవిధంగా ఫిబ్రవరి 19న ఎన్విరాన్మెంటల్ పరీక్షకు సంబంధించి 60 మార్కులకు థియరీ రికార్డుకు 40 మార్కులు కేటాయించారని ఈ విషయాల మీద స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. అదేవిధంగా అధ్యాపకులకు పరీక్షల నిర్వహణ మీద పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్,డిపార్టుమెంటల్ ఆఫీసర్ జోజి రెడ్డి,హెచ్ వెంకటేశ్వరరావు,అధ్యాపకులు లింగారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


## మేమేంతో మాకంత వాటా దక్కాల్సిందే:లింగంగౌడ్ జాజుల





**తార్నాక, ఫిబ్రవరి 9:**
:బీసీల జనాభా దామాషా ప్రకారం మేమెంతో మాకంత వాటా దక్కాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య%శీ% వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని అన్నారు. ఈ దేశంలో కుక్కలకు,బర్రెలకు లెక్కలున్నాయి కానీ బీసీలకు లెక్కలు లేవని అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బీసీల జనాభా లెక్కలు తీయాలని అన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి.విద్య, ఉద్యోగ రంగాల్లో ఓబీసీ ల రిజర్వేషన్లు 27% నుండి 50% కు పెంచాలి. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి.బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ లలో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్, మహేష్ యాదవ్, వరికుప్పల మధు, నరేశ్, గూడూరు భాస్కర్,స్వామి,తార,కందుల ప్రభాకర్,శ్యామల, కనకయ్య, వంశీ ముదిరాజ్, శ్రీనివాస్, వెంకట్, రాంబాబు యాదవ్,మాధవి, నాగమణి, శ్రీలత,దేవి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తాం అని అన్నారు : గవర్నర్



**ఖమ్మం ఫిబ్రవరి 9:**
రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని తెలంగాణ గవర్నర్ తమిళి సై అన్నారుఅసెంబ్లీ సమావేశంలోఆమె మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు త్వరలోనే మరో రెండు గ్యారెంటీలను అమలు చేస్తామని అన్నారుఅర్హులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. రెండు లక్షల ఉద్యోగాలకు కట్టుబడి ఉన్నామని అన్నారు.

# సన్నగిల్లుతున్న ప్రజల కొనుగోలు శక్తి ప్రజా సమస్యలు చర్చనీయాంశాలు కావాలని అన్నారు : సెమినార్ లో ప్రొఫెసర్ నాగేశ్వర్





**ఖమ్మం ఫిబ్రవరి 8:**
దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా పెరుగుతుందని పాలకులు బాకాలు ఊదుతున్న సమయంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుందని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ విశ్లేషకులు, మాజీ శాసన మండలి సభ్యులు ప్రో? నాగేశ్వర్ తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా పారిశ్రామికాభివృద్ధి జరగదని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలు కాకుండా ఇతర అనేక అంశాలు చర్చనీయాంశం అవుతున్నాయని ఇది సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 16న సార్వత్రిక సమ్మె ఆవశ్యకత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు సెమినార్కు ముఖ్య అతిథిగా ప్రో? నాగేశ్వర్ హాజరయ్యారు. తోట రామాంజనేయులు, జి. రామయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎండివై పాషా, నరేష్ మోహన్ నాయుడు, ఐ. వెంకన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన సెమినార్లో ప్రో? నాగేశ్వర్ మాట్లాడుతూ అతి త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈనెల 16న సమ్మె ఏమిటన్న చర్చ సాగుతుంది. ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నెలకొన్న నిరుద్యోగం, ఉపాధి, సామాన్యుల సమస్యలు ఎజెండాగా ఉండాల్సిన నేపథ్యంలో వాటి ప్రస్తావనే జరగడం లేదని నాగేశ్వర్ - తెలిపారు. అయోధ్య రామున్ని పెట్టాం పాకిస్తాన్ను ఓడిస్తాం, చైనాను తరిమికొడతాం లేదా పార్లమెంటులో ఏదో ఏర్పాటు చేశామంటూ ఓట్లు అడుగుతున్నారని వీటితో పాటు భావోద్వేగాలను రెచ్చగొడుతూ విపక్ష పార్టీలను బలహీనపరుస్తున్నారని నాగేశ్వర్ తెలిపారు. ఇండియా కూటమి నుంచి కొందరిని బయటకు లాగుతున్నారని నాగేశ్వర్ తెలిపారు మీడియా సైతం ప్రజల సమస్యలకు ప్రాధాన్యత నివ్వడం లేదని ఈనెల 16న సార్వత్రిక సమ్మెపై మీడియాలో చర్చే లేదన్నారు. రైతులు, కార్మికులు, పేదల సమస్యలను సామూహికంగా, సంఘటితంగా దేశం ముందు ఉంచేందుకే కార్మికులు, కర్షకులు, రైతులు సమ్మెను తలపెట్టారని నాగేశ్వర్ తెలిపారు. ఒక సామూహిక డిమాండ్ను అటు పాలకుల దృష్టికి ఇటు ప్రజల దృష్టికి తీసుకు వచ్చే ప్రయత్నమే ఈనెల 16న పారిశ్రామిక గ్రామీణ బంద్ అని నాగేశ్వర్ తెలిపారు. కార్యక్షేత్రంలో పాలకుల విధానాలను వ్యతిరేకించే వారు తిరిగి ఆ పాలకులకే ఓట్లు వేయడం దురదృష్ట కరమన్నారు దేశంలో 47.5 శాతం సంపద ఒక్క శాతం మందిలో ఉందని 10 శాతం మంది చేతిలో 72 శాతం ఆదాయం ఉందని నాగేశ్వర్ విశ్లేషించారు అత్యధిక ఆదాయం కొద్ది మంది చేతుల్లో ఉందని అందుకే భారత ఆర్థిక వ్యవస్థ 7.3 శాతం జీడిపి నమోదైన సామాన్యుల జీవితాల్లో ఆర్థిక మెరుగుదల కనిపించడం లేదన్నారు అత్యధిక ఆదాయం కొద్ది మంది చేతుల్లో ఉండగా 22 కోట్ల మంది 375 రూపాయల రోజు సంపదనతో బతుకుతుంటే గౌతమ్ అదానీ రోజు ఆదాయం రూ.1600 కోట్లు అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా దేశ ఆర్థికవ్యవస్థ పెరిగినా ప్రమాదమేనన్నారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలు ఎజెండాగా సాగేందుకు, పరిష్కారం జరిగేందుకు సమ్మె దోహద పడుతుందన్నారు ఈ సెమినార్లో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సిపిఎంనాయకులు యర్రా శ్రీకాంత్, సాయిబాబు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు రాయల చంద్రశేఖర్, గోకినేపల్లివెంకటేశ్వరరావు, రైతు సంఘాల నాయకులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తిమ్మిడి హన్మంతరావు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సింహారావు, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం ఫిబ్రవరి 9:** ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభితో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు డయాగ్నోస్టిక్ హబ్ కి రోగుల నుండి పరీక్షల నిమిత్తం సేకరిస్తున్న రోజువారి శాంపిల్ల గురించి అడిగి తెలుసుకున్నారు ఎన్సిడి రిజిస్టర్ పరిశీలించి, ఎంత మందికి ఏ ఏ రకాల మందులు ఇస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఇడిడి వివరాలు కేంద్రంలో ప్రదర్శించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. కుక్క, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రాములు నాయక్, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పార్లమెంట్ వేదికగా వైట్ పేపర్ Vs బ్లాక్ పేపర్..

# అసలేంటీ వార్..?

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సమావేశాల్లో వైట్, బ్లాక్ పేపర్ల వార్ మొదలైంది. దేశ ఆర్థిక స్థితిగతులపై అధికార, విపక్ష పార్టీలు నేడు పార్లమెంట్లో వైట్, బ్లాక్ పేపర్లను సమర్పించేందుకు సిద్ధమయ్యాయి. తన పదేళ్ల పాలనపై కేంద్రంలోని అధికార బీజేపీ గురువారం పార్లమెంట్లో 'వైట్పేపర్' ను ప్రవేశపెట్టబోతోంది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాధించిన విజయాలను జాబితా చేస్తూ శ్వేతపత్రం విడుదలకు సిద్ధమైంది. ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ శ్వేతపత్రాన్ని సమర్పిస్తామని ప్రకటించారు. 2014 ముందు వరకు, ఆ తర్వాత దేశ ఆర్థిక పరిస్థితి మధ్య తేడాను వెల్లడించే ఉద్దేశంతో దీనిని పార్లమెంట్ ఉభయసభల ముందు ఉంచుతామన్నారు. దాని ద్వారా గత పాలనలో లోపాలను ఎత్తిచూపడమే తమ లక్ష్యమని చెప్పారు. బీజేపీకి పోటీగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కూడా బరిలోకి దిగింది. గత పదేళ్ల మోదీ ప్రభుత్వ పనితీరుపై శ్వేతపత్రాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ 'బ్లాక్ పేపర్' ప్రవేశ పెట్టబోతోంది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ



బ్లాక్ పేపర్ను సభ ముందుకు తీసుకెళ్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పదేళ్ల నరేంద్ర మోదీ పాలన వైఫల్యాలను ఎత్తిచూపే ఉద్దేశంతోనే బ్లాక్పేపర్ను పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. బీజేపీ హయాంలో పెరిగిన ధరలు, నిరుద్యోగం తదితర అంశాలను బ్లాక్ పేపర్ లో వివరించనున్నట్లు పేర్కొన్నాయి.

# మోదీ కులంపై రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీ కాదని, ఆయన జనరల్ క్యాటగిరీకి చెందినవారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ గురువారం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. రాహుల్ గాంధీ ఇలా స్థాయి దిగజారి మాట్లాడతారా అని బీజేపీ సీనియర్ నేత రవి శంకర్ ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. పేదలు, ఎస్సీ, ఎస్టీలు, బీసీలు నరేంద్ర మోదీని తమ నేతగా భావిస్తారని, కాంగ్రెస్ భవిష్యత్ అంధకారంలో ఉండటంతో రాహుల్ ఇలా మాట్లాడుతున్నారని, ఇది సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి కాబోయే రెండేండ్ల ముందే ఆయన కులాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీగా నోటిఫై చేసిందని బీజేపీ పేర్కొంది. రాహుల్ గాంధీ అసత్యాలు చెబుతున్నారని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. 1999 అక్టోబర్ 27న ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహించే కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చారని, నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకూ నెహ్రూ-గాంధీ కుటుంబం ఓబీసీలకు వ్యతిరేకమని మాలవీయ కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ కులంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అంతకుముందు సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఒడిషాలోని ఝూర్సుగుడలో రాహుల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఓబీసీ క్యాటగిరీలో జన్మించలేదని, గుజరాత్లోని తేలి కులంలో ఆయన జన్మించారని చెప్పారు. 2000 సంవత్సరంలో ఆ కులాన్ని బీజేపీ ఓబీసీ క్యాటగిరీలో చేర్చిందని అన్నారు. మోదీ సాధారణ కులంలోనే జన్మించారని, స్వతహాగా ఓబీసీ కాదని రాహుల్ ఆరోపించారు. మోదీ ఓబీసీగా జన్మించనందునే ఆయన తన జీవితాంతం కులగణన నిర్వహించేందుకు అనుమతించరని అన్నారు.

# పుట్టుకతోనే కాంగ్రెస్ రిజర్వేషన్ల వ్యతిరేకి



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఆలోచనల్లోనూ అవుట్ డేట్ అయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఆ పార్టీ 40 సీట్లు కూడా సాధించలేదంటూ పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ అన్నారని చెబుతూ కాంగ్రెస్ కనీసం 40 సీట్లలోనైనా గెలవాలని కోరుకుంటున్నానని వ్యంగ్యంగా అన్నారు. 'రానున్న లోక్ సభ ఎన్నికల్లో మాకు 400 సీట్లు వస్తాయని ఖర్గే అన్నారు. అది మాకు ఆశీర్వాదంగా భావిస్తున్నా. ఆయన అంచనా కచ్చితంగా నిజమవుతుంది' అని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని రాజ్యసభలో బుధవారం సుదీర్ఘంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. నెహ్రూ కాలం నుంచి ఆ పార్టీ ఎన్నో అవకతవకలకు పాల్పడిందన్నారు. అంబేద్కర్ కు సైతం భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ అగ్రనేతలు అనుకోలేదనీ, కానీ తమ కుటుంబ సభ్యులకు మాత్రం ఇచ్చుకున్నారని విమర్శించారు.
చూస్తుండగానే కాంగ్రెస్ పతనమైపోయిందని చెబుతూ, ఆ పార్టీ పతనం తనకు ఆనందాన్ని ఇవ్వడంలేదన్నారు. వికసిత భారత్ కోసం మోదీ 3.0 అవసరమన్నారు. వచ్చే ఐదేళ్ల లో ఎన్నడూ లేనంత అభివృద్ధిని చూడబోతున్నామన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి పైప్ లైన్ ద్వారా గ్యాస్ అందుతుందని, భారత్ ను ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థ తీరు కూడా మారుతుందన్నారు. అనేక సందర్భాల్లో కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మోదీ విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను రాత్రికి రాత్రే గద్దె దించిన ఘనత ఆ పార్టీదన్నారు. యుపిఏ హయాంలో ఆర్థిక వ్యవస్థ అడుగంటిందని, పత్రికాస్వేచ్ఛను కాలరాశారని అన్నారు. ఆ పార్టీ ఏలుబడిలోనే దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదం పెరిగాయని చెప్పారు. ఆదివాసీలు, దళితులు అంటే కాంగ్రెస్ కు గిట్టదన్నారు. పుట్టుకతోనే కాంగ్రెస్ రిజర్వేషన్ల వ్యతిరేకి అని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ రిజర్వేషన్లకు వ్యతిరేకించారని, ఒకప్పుడు ఆయన ముఖ్యమంత్రులకు రాసిన లేఖలే ఇందుకు నిదర్శనం అని అన్నారు.
ఈ సందర్భంగా ఆయన నెహ్రూ లేఖల్లోని కొన్ని భాగాలను చదివి వినిపించారు. ఎస్సి, ఎస్టీ, ఒబిసి రిజర్వేషన్లకు నెహ్రూ వ్యతిరేకి అని, వారికి రిజర్వేషన్లు ఇస్తే ఉద్యోగులలో నైపుణ్యం దెబ్బతింటుందని నెహ్రూ పేర్కొన్నారని చెప్పారు. ఈ లేఖ రికార్డుల్లో ఉందన్నారు. అంబేద్కర్ లేకపోతే రిజర్వేషన్లు దక్కేవి కావన్నారు. తమ ప్రభుత్వం ఓ ఆదివాసీ బిడ్డను రాష్ట్రపతిని చేసిందని చెప్పారు. ఎస్సి, ఎస్టీ, ఒబిసిలకు అన్ని పదవుల్లోనూ ప్రాధాన్యమిచ్చామన్నారు. పదేళ్ల క్రితం 120 ఏకలవ్య స్కూళ్లు ఉంటే, ఆ సంఖ్య ఇప్పుడు 400కి పెరిగిందన్నారు. దేశంలో రెండు ట్రైబల్ సెంట్రల్ యూనివర్శిటీలు ఉన్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే ఐదో స్థానానికి చేర్చిందని మోదీ చెప్పారు. మేకిన్ ఇండియాను ప్రోత్సహిస్తున్నామన్నారు. బానిసత్వపు గుర్తులను చెరిపేసే పనిలో ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మన భూభాగాలను శత్రువులకు అప్పగించిందని, సైనిక ఆధునీకీకరణను సైతం నిలిపివేసిందని విమర్శించారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ జాతీయ భద్రత గురించి పాఠాలు చెబుతోందని ఎద్దేవా చేశారు. దేశం అబివృద్ధి చెందినప్పుడే రాష్ట్రాలు అబివృద్ధి చెందుతాయని మోదీ అన్నారు. 'నా దేశం అంటే ఒక్క ఢిల్లీయే కాదు, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ అన్నీ నావే. ఓ రాష్ట్రంలో సంక్షోభం వస్తే దాని ప్రభావం దేశమంతటా ఉంటుంది' అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నామని కాంగ్రెస్ తప్పుడు ప్రచారంచేస్తోందనీ, బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, హెచ్ఏఎల్, ఎయిర్ ఇండియాలను దెబ్బతీసిందెవరు? మీ హయాంలో ఎల్ఐసీ ఎక్కడుంది, ఇప్పుడెక్కడుంది?' అని మోదీ ప్రశ్నించారు. పిఎస్యులపై మదుపరుల విశ్వాసం పెరిగిందని, ఈ పదేళ్లలో పిఎస్యుల విలువ 9.5 లక్షల కోట్లనుంచి 17 లక్షల కోట్ల రూపాయలకు పెరిగిందని చెప్పారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అనేది ఒక నినాదం కాదనీ, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని ప్రధాని చెప్పారు.

**ఉత్తర, దక్షిణ విభజన రేఖలు విషాదకరం**

దేశాన్ని ఉత్తరాది , దక్షిణాదిగా విభజించే తీరులో వ్యవహరించడం దారుణమని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి విభజనరేఖల తీరుతో దేశ భవిత కుంటుపడుతుందని, ఇకనైనా కాంగ్రెస్ పార్టీ, కర్నాటకలోని ఆ పార్టీ ప్రభుత్వం ఈ చెలగాటాల వైఖరిని వీడాలని, ఈ మేరకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. రాజ్యసభలో బుధవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల చర్చకు ప్రధాని సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీవరంగా విభజనరేఖలను చిత్రీకరిస్తోంది. పైగా ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక ప్రభుత్వం నుంచి ఏకంగా పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నారని ఇది ప్రజా ధనం దుర్వినియోగం ద్వారా చేస్తున్న దుష్ప్రచారం అవుతోందని విమర్శించారు. కర్నాటకకు కేంద్రం నిధుల వాటాలో , పలు పన్నుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని చెపుతూ కర్నాటక కాంగ్రెస్ తరఫున సిఎం సిద్ధరామయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడాన్ని ప్రధాని ప్రస్తావించారు. వారు డిమాండ్లను ప్రస్తావించవచ్చు.
అయితే వీరు ఎంచుకున్న ద్వేషపూరిత వైఖరి బాధాకరం, దేశానికి నష్టదాయకం అవుతుందని ప్రధాని తెలిపారు. ఈరోజున తాను నిర్దిష్ట విషయంలో తన బాధను ఈ సభావేదిక ద్వారా అందరితో పంచుకుంటు న్నానని, కొందరు వాడుతున్న పదజాలం దేశాన్ని ముక్కలు చేసే స్థాయిలో ఉంటోంది. కేవలం రాజకీయ స్వార్థప్రయోజనాలకు, అధికారం దొడ్డిదారిన దక్కించుకునేందుకు పాల్పడుతున్న చేష్టలు అందరిని కలవరపరుస్తున్నాయని ప్రధాని చెప్పారు. ఎన్నికలు, రాజకీయాలను పరిగణనలోకి తీసుకుని మొత్తం రాష్ట్రం ఈ విధంగా మాట్లాడటం ఇబ్బందికరం. ఇటువంటి భాషపదప్రయోగాలు అనుచితం అని పేర్కొన్న ప్రధాని కర్నాటక ప్రభుత్వం వెలువరించిన యాడ్స్లోని భాషను చూసి ఏమనుకోవాలి? అని ప్రశ్నించారు. దేశం ముందుకు వెళ్తోంది. రేపటి తరం సరైన భవితను ఎంచుకునేందుకు సాగుతోంది. దీనిని అడ్డుకునే రీతిలో ఇప్పుడు వ్యవహరించడం ఇబ్బందికరం అని స్పష్టం చేశారు. దేశంలోని ఒక ప్రాంతంలో తయారు అయిన వ్యాక్సిన్ను దేశంలోని ఇతర పార్టీలకు ఇవ్వడం ఎందుకని కొందరు చెపుతున్నారు ? ఇది ఎంతవరకూ సబబు అని మోదీ ప్రశ్నించారు. ఇటువంటి ఆలోచనలు ఏమిటీ? ఇటువంటి బాధాకరమైన భాషను ఏకంగా ఓ జాతీయ పార్టీ వాడటం నిజానికి విషాదకరం అవుతుందని తెలిపారు.

**ఈ దేశం కేవలం భూ తునక కాదు అంతకు మించి ఎంతో ఉంది**

భారత దేశం అంటే కేవలం కొన్ని ప్రాంతాల కలయికలతో కూడిన భూ భాగం అని అనుకోరాదు. ఇది భూతునక అనుకోవడం, దీనికి ప్రాంతీయ భేదాలు ఆపాదించడం బాధాకరం అవుతుందని మోదీ తెలిపారు. శరీరంలో ఎక్కడైనా నొప్పి ఉంటే అది అంతటికి తెలుస్తుంది. మన పాదానికి ముల్లు గుచ్చుకుంటే తనకెందుకు లే అని మన చేయి అనుకోదు. దీనిని తొలిగించేందుకు సహజసిద్ధంగా , అసంకల్పితంగా చొరవ తీసుకుంటుందని చెప్పారు. ఇది మనకు కూడా వర్తిస్తుందని దేశంలో ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే ఇతర ప్రాంతాలు కూడా బాధపడుతాయి. అందరు కూడా దీనిని అనుభూతి చెందుతారు. ఏదైనా శరీరభాగం పనిచేయకపోతే మనను దివ్యాంగులుగా వ్యవహరిస్తారు. ఏ ప్రాంతం అయినా ప్రగతి లేకపోతే దేశం అంతా కూడా దెబ్బతింటుందని, ప్రగతికర దేశంగా ఎవరూ చూడరని తెలిపారు. దేశాన్ని ఒకే ప్రాంతంగా భావించాల్సి ఉంటుంది, తప్పితే వేర్వేరు భాగాలుగా పరిగణించరాదని, ఈ భావనతో ముందుకు సాగడం చేటుకు దారితీస్తుందని విమర్శించారు. హిమాలయాలను ఉదాహరణ తీసుకోండి. ఈ పర్వతాల ప్రారంభ చోటున ఉద్భవించిన నదుల జలాలను ఇతర ప్రాంతాల వారు అనుభవించడం లేదా? అని ప్రశ్నించారు. విభజన ఆలోచనలు తలెత్తితే , ఇది ఇంతటితో ఆగిపోదు. బొగ్గు గనులు ఉన్న రాష్ట్రాల బొగ్గు ఇతర ప్రాంతాల వారు పంచుకోకూడదా? కాదంటే ఇక దేశం ఏ గతి నడుస్తుంది? అని ప్రశ్నించారు. తూర్పు రాష్ట్రాలు తమ వైపు నుంచి వీచే గాలిని ఇతర రాష్ట్రాలకు వెళ్లనివ్వమని చెబితే ఏం జరుగుతుందని ప్రశ్నించారు. మా డబ్బు మా పన్నుల వాటా అని కొందరు అనుకోవడం ? ఏమిటిది అని కాంగ్రెస్కు చురకలు పెట్టారు. ఈ దేశం అంతా ఒక్కటిగా భావించుకుని ముందుకు సాగండి. ప్రగతిపథంలో సమిష్టిత్వం తప్పితే సంకుచితం పనికిరాదని మోదీ స్పష్టం చేశారు.

# శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసు.. రంగంలోకి ఈడీ, ఐటీ!

హైదరాబాద్: హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఈడీతోపాటు ఐటీ అధికారులు రంగంలోకి దిగనున్నారు. శివబాలకృష్ణ ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టులను తమకు ఇవ్వాలని ఏసీబీకి ఈడీ లేఖ రాసింది. మనీలాండరింగ్ కోణంలో ఆయనను విచారించనుంది. మరోవైపు శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై కూడా ఐటీ అధికారులు విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తున్నది. అధికారాన్ని ఉపయోగించుకుని భారీగా అక్రమాస్తులను కూడబెట్టిన శివబాలకృష్ణను ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏసీబీ కస్టడీ బుధవారంతో ముగిసింది. 8 రోజుల కస్టడీలో చేపట్టిన విచారణలో రూ.250 కోట్ల అక్రమాస్తులను గుర్తించారు. శివబాలకృష్ణ బంధువుల పేరిట 214 ఎకరరాల వ్యవసాయ భూములు రిజిస్టర్ అయినట్టు



తేలిందని అధికారులు తెలిపారు. జనగామ జిల్లాలో 102, యాదాద్రి భువనగిరి జిల్లాలో 66, నాగర్కర్నూల్ జిల్లాలో 38, సిద్ధిపేటలో 7 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో 29, ఆంధ్రప్రదేశ్లోని విజయనగరం, విశాఖపట్నంలో 3 ఓపెన్ ప్లాట్లతోపాటు రూ.30.3 కోట్ల విలువైన 7 ఫ్లాట్లు, 3 విల్లాలను గుర్తించినట్టు తెలిపారు. బ్యాంకు లాకర్లో ఉన్న 18 తులాల బంగారం, ఓ పాస్బుక్ను జప్తు చేశామన్నారు. శివబాలకృష్ణ సోదరుడు శివనవీన్కుమార్ అరెస్టుతో మరో నలుగురు బినామీలను గుర్తించినట్టు చెప్పారు. శివనవీన్కుమార్ భార్య పేరిట ఉన్న ఆస్తులపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. శివబాలకృష్ణ అక్రమాల వెనుక హెచ్ఎమ్డీఏ, మెట్రోరైల్ అధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

# నన్ను అలా అనొద్దు... నేను తెలంగాణ ఆడబిడ్డనే రేవంత్: కవిత




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీతం గురించి సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎంఎల్సి కవిత తెలిపారు. కవిత మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నడూ జై తెలంగాణ అని కూడా అనలేదని విమర్శలు గుప్పించారు. తెలంగాణ తల్లి విగ్రహం కవితలాగా ఉందని సిఎం రేవంత్ అనడం మంచిది కాదని, తాను తెలంగాణ ఆడబిడ్డనే కదా? అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం గురించి సిఎం రేవంత్ మాట్లాడటం ఏంటి అని ప్రశ్నించారు. టిఎస్పిఎస్సి చైర్మన్ మహేందర్ రెడ్డిని తొలగించాలని డిమాండ్ చేశారు. మహేందర్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు వస్తుండడంతో న్యాయ విచారణ జరపాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరెంట్ కోతలు మొదలయ్యాయని, విద్యుత్ సంస్థల్లో ఎపి వాళ్లను డైరెక్టర్లుగా నియమించారని, తెలంగాణ అసెంబ్లీకి ఎపి సలహాదారులు ఎందుకు అని కవిత ప్రశ్నించారు.

## సంపాదకీయం

### వాగ్బాణాలే – జవాబు లేదు

ప్రధానమంత్రి నరేంద్రమోడీ సంభాషణా చతురు డు. పదప్రయోగాలతో, వాగ్బాణాలతో ప్రతిపక్షాలను నోరెత్తనీయకుండా చేస్తున్నారు. ఎక్కడ ఏ పదం ఉపయోగించాలో, ఏ ఉపమానాన్ని వాడాలో ఆయనకు బాగా తెలుసు.ఇందుకు ఎన్నో ఉదాహరణలు. తాజాగా, అదానీ వ్యవహారంలో ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టేందుకు ఆయన ప్రతిపక్షాలు విసిరే బురదలోనూ కమలం వికసిస్తుందంటూ సెటైర్ వేశారు.ఇది వినడానికి ఎంతో సొంపుగా ఉంది. లాజికల్‌గా ఉంది. నైతికంగా మాత్రం నిలబడదు. తన ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణ లకు సూటిగా సమాధానం చెప్పకుం డా యూపీఏ కాలం నాటి కుంభకోణాలను ఏకరవు పెట్టి ప్రతిపక్షాల నోళ్ళు మూయించేందుకు ప్రయత్నించారన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తం అవుతోంది. యూపీఏ పాలనలో స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణాలపై ఆరోపణలు, ప్రత్యారోప ణలతో పార్లమెంటు రోజుల తరబడి వాయిదా పడింది. ఇప్పుడు అదానీ వ్యవహారం పార్లమెంటును రోజుల తరబడి కుదిపేస్తోంది. ప్రధాని ప్రస్తావించిన యూపీఏ కాలం నాటి కుంభకోణాలపై విదేశీ సంస్థల నుంచి మాట పడలేదు.అదానీ నడిపిన వ్యవహారాన్ని గురించి అమె రికాకి చెందిన పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ వ్యాఖ్యాని స్తూ జాతీయవాదం ముసుగులో కోట్లాది విలువైన షేర్ల ను మసిపూసి మారేడు కాయ చేశారంటూ వ్యాఖ్యానిం చింది. యూపీఏ హయాంలో వెలుగు చూసిన కుంభ కోణాల సందర్భంగా ఏ విదేశీ సంస్థా ఈ మాదిరి వ్యాఖ్య చేయలేదు. స్పెక్ట్రమ్ కుంభకోణంలో యూపీఏ ప్రధాన భాగస్వామ్య పక్షానికి చెందిన డిఎంకె నాయకుడు రాజా నూ, ఆనాటి డిఎంకె అధ్యక్షుడు కరుణానిధి కుమార్తె, పార్లమెంటు సభ్యురాలు కనిమొళిని జైలులో పెట్టారు. యూపీఏ హయాం నాటి కుంభకోణాలు కేవలం జాతీ య స్థాయిలోనే ప్రభుత్వం ప్రతిష్టను మంటగలపగా, ఇప్పటి అదానీ వ్యవహారం అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వప్రతిష్టను మసకబార్చింది. దీనిని గురించి ప్రతిపక్షాలు ప్రస్తావించినప్పుడు ప్రధానమంత్రి కనీసం మాట మాత్రంగానైనా సమాధానం చెప్పలేదు. కాంగ్రెస్ హయాంలో జరిగిన కుంభకోణాల గురించి ఆయన ఇదే సభలో ఇదే స్థానంలోఉండి ఎన్నిసార్లు ఎండగట్టారో నిరంతర వార్తా స్రవంతులను వీక్షిస్తున్న వారికి తెలుసు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రసంగానికి కృతజ్ఞతలు తెలియజేసే అవకాశాన్నీ,సమయాన్నీ ఆయ న తన ప్రభుత్వం చేసిన మంచి పనులకు, ప్రతిపక్షాలపై విమర్శలకే ఎక్కువ వినియోగించారు. రాజ్యాంగంలోని 356వఅధికరణాన్ని వినియోగించి రాష్ట్ర ప్రభుత్వాలను కాంగ్రెస్ ప్రభుత్వం పడగొట్టిందంటూ మోడీ వెల్లడించి న గణాంకాల వివరాలను ఎవరూ కాదనడం లేదు. అయితే, 8 రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలను ఫిరా యింపుల ద్వారా పడగొట్టింది తమ ప్రభుత్వ హయాం లోనేనన్న సంగతిని విస్మరించారు. అవినీతి విషయం లో తమ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తోందం టూ మోడీ చెప్పుకొ చ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి గురించి మీడియాలో రోజూ కథనాలు వస్తున్నా యి. కర్నాటకలో సాక్షాత్తూ మంత్రులే పనుల్లో కమిషన్ డిమాండ్ చేయడం వల్ల ఇద్దరు కాంట్రాక్టర్లు ఆత్మహత్య లు చేసుకున్న ఘటనలకు ప్రధాని ఏంసమాధానం చెబు తారు. అసోంలో, త్రిపురలో అవినీతి ఆరోపణల కారణంగానే ముఖ్యమంత్రులను మార్చాల్సి వచ్చింది. అంత మాత్రాన కాంగ్రెస్ అవినీతినీ,యూపీఏ భాగస్వామ్య పక్షాల అవినీతినీ ఎవరూ సమర్థించరు. కానీ, అవినీతి విషయంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అని ప్రజ లు బాహాటంగా చెప్పుకుంటున్నారు.కరోనా నిరోధ క వ్యాక్సిన్ల తయారీ, పంపిణీ గురించి ప్రధానమంత్రి పదే పదే చెబుతున్నారు.రెండు వ్యాక్సిన్ల తయారీ యూనిట్ల కు యూపీఏ హయాం లోనే బీజాలు పడ్డాయి. విదేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయడంలో మోడీ చొరవ చూపడం వల్లనే ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం భారత్‌ని ప్రశంసిం చింది పొరుగుదేశాలు, మిత్ర దేశాలు కష్టాల్లో ఉన్నప్పు డు ఆదుకోవడం అనేది యూపీఏ హయాంలోనూ జరిగింది.అలాంటివి ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా క్రమానుగ తంగా జరిగిపోతూ ఉంటాయి. కుంభకోణాల పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు కాంగ్రెస్ హయాంలో జరిగింది. బోఫోర్స్ కుంభకోణంపై ఆనాటి కేంద్ర మంత్రి శంకరానంద నేతృత్వంలో జేపీసీని ఏర్పా టు చేయడం జరిగింది. అదానీ వ్యవహారంపై జేపీసీని ఏర్పాటు చేయమన్న ప్రతిపక్షాల డిమాం డ్‌ని ఆమోదిం చేందుకు మోడీ ప్రభుత్వం ఎందుకు వెనకాడుతోంది. వాదనా పూర్వకంగా తీసుకుంటే ఇలాంటివి ఎ న్నో ఉన్నా యి. ప్రతిపక్షాల డిమాండ్లకు స్పందించడం ప్రభుత్వం ధర్మం. అందుకు విరుద్ధంగా ఏవేవో చెప్పుకుంటూ పోవ డం తప్పించుకోచూడటమే. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు ప్రధానమంత్రి సూటిగా సమాధా నాలు చెప్ప లేదు. ఎదురుదాడితోనే తన ప్రసంగాన్ని ముగించారు. అందుకే, హిందూసేన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయ స్థానం కొట్టివేయడం ఆశ్చర్యాన్ని కలించలేదు.

# ఆలోచనలను గౌరవించని అవార్డులు...!



'ఢిల్లీ వెళితే ప్రస్తుతం మన సమస్యలు చెప్పుకోవడానికి పెద్ద దిక్కుగా ఉన్న నాయకులు లేరు. వ్యాపారస్తులు ప్రజా ప్రతినిధులవుతున్నారు..' అని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మా పురస్కార గ్రహీతలకు సన్మానం చేస్తూ వాపోయారు. నిజమే. ఇప్పుడు దేశ రాజకీయాల్లో ఒక స్థాయి గల ప్రజా ప్రతినిధులు కనపడడం లేదు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్రన్నాయుడు తదితరులు ప్రజా ప్రతినిధులుగా ఉన్న కాలంలో నిత్యం నేతలతో మాట్లాడుతూ, విలేఖరులకు సమయం కేటాయిస్తూ గడిపేవారు. ఒక రోజు ఏఐసీసీ ఏర్పాటు చేసిన ఒక కమిటీ సమావేశంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి తెలంగాణను వ్యతిరేకించారని తెలిసి వార్త రాశాను. మరుసటి రోజు ఎప్పటి మాదిరే ఏఐసీసీలో రోజువారీ విలేఖరుల సమావేశం పూర్తి కాగానే నలుగురైదుగురు సీనియర్ జర్నలిస్టులతో పాటు ఆయన ఇంటికి వెళ్లినప్పుడు 'ఆ వార్త ఎందుకు రాశావు.. మళ్లీ నాకు కనపడకు' అని కోట్ల ఆగ్రహించారు. మరునాడు ఆయన ఇంటికి వెళ్లలేదు. దీనితో ఆయనే ఫోన్ చేశారు.

'నిన్న ఏదో కోపంతో అంటే మనసు మీదికి తీసుకుంటావా.. నీకంటే ఎంతో పెద్దవాడిని కదా..' అనేసరికి ఎంతో సంతోషంతో ఆయనను కలుసుకున్నాను. జైపాల్ రెడ్డి ఢిల్లీలో కేంద్రమంత్రిగా ఉన్నా సరే, ఆయన ఇంటి గేట్లు ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయనతో మాట్లాడిన తర్వాత ఎన్నో పుస్తకాలు చదివిన జ్ఞానం కలిగేది. మురళీ మనోహర్ జోషి లాంటి సాంప్రదాయవాది కూడా జైపాల్ అంటే ఇష్టపడేవారు.

వెంకయ్యతో ఆయనకు వ్యక్తిగత స్నేహం బలంగా ఉండేది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న ఒక దశలో కూడా ఇరు ప్రాంతాల ఎంపీలు, నేతలు ఆయనను కలుసుకుని ముఖ్యమంత్రిగా ఉండమని జైపాల్‌ను కోరడం ఆయన పట్ల ప్రాంతాలకు అతీతంగా ఉన్న గౌరవానికి నిదర్శనం. కాని అందుకు ఆయన నిరాకరించారు. వెంకయ్యనాయుడు బీజేపీలో జాతీయ స్థాయికి ఎదిగి ఢిల్లీలో ప్రవేశించిన తర్వాత పార్టీకి ప్రజల్లో, ఆమోదయోగ్యత పొందడంలో కీలక పాత్ర పోషించారు. ఒక అజాతశత్రువుగా పేరు పొందిన వెంకయ్య పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండే ప్రజాస్వామ్యవాదిగా పేరు తెచ్చుకున్నారు. రాజశేఖర్ రెడ్డి కూడా ఎంపీగా ఉన్న కాలంలో ఇతరపార్టీ నేతలతో, మీడియాతో అరమరికలు లేకుండా ఉండేవారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎర్రన్నాయుడు పార్లమెంటరీ పార్టీ నేతలుగా ఉన్న కాలంలో తెలుగుదేశం పార్టీ జాతీయ స్థాయిలో ఒక వెలుగు వెలిగింది. ఎర్రన్నాయుడు పిల్లల కోడిలా ఎప్పుడూ ఎంపీలను, రాష్ట్ర నేతలను వెంటవేసుకుని కేంద్ర మంత్రుల వద్దకు తీసుకువెళ్లేవారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా ఎర్రన్నాయుడును చూసి చిరునవ్వుతో పలకరించేవారు.

ఇప్పుడు ఢిల్లీలో ఆ వాతావరణమే లేదు. రేవంత్ అన్నట్లుగా ఢిల్లీకి వెళ్లే తెలుగు రాజకీయ నేతలకు వెంకయ్యలాంటి పెద్ద దిక్కు ఎవరూ లేరు. అమిత్ షాతో పాటు పలువురు కేంద్రమంత్రులను తన వద్దకు పిలిపించి ఉభయ రాష్ట్రాల సమస్యలు చర్చించి పరిష్కారం సాధించగల శక్తి వెంకయ్యకు ఉండేది. ఎవరు ఢిల్లీకి వచ్చినా తన ఇంటికి పిలిచి సంభాషించే జైపాల్ రెడ్డి లాంటి విజ్ఞాన ఖని కనపడడం లేదు. వెంకయ్య, జైపాల్ ఇద్దరూ దక్షిణాది వారన్న అభిప్రాయం ఉత్తరాది వారికి కూడా ఉండేది కాదు. ఇద్దరూ తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పట్టు సంపాదించారు. జైపాల్ రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు అంబానీ, రూపర్ట్ మర్డోక్ అయినా అపాయింట్‌మెంట్ తీసుకుని కలుసుకోవాల్సి వచ్చేది. 17వ లోక్‌సభ చిరి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయమది. ఆలోచిస్తుంటే గడిచిన అయిదేళ్లలో ఢిల్లీలో మన తెలుగువారి దుస్థితి గుర్తుకు వచ్చి ఆవేదన కలుగుతోంది. ఒక స్థాయిగల తెలుగు నేతలు పెద్దగా ఢిల్లీలో కనపడడం లేదు. వైసీపీకి ఉభయసభల్లో 30 మంది ఎంపీలున్నా వారు తమదైన ముద్ర ఢిల్లీలో వేయలేకపోయారు. బీఆర్ఎస్ ఎంపీలు సరే సరి. బీజేపీ అగ్రనేతలు కనపడితే వంగివంగి దండాలు పెడుతుంటే మన తెలుగు రాష్ట్రాల నేతలు ఇంత మరుగుజ్జులా అన్న అభిప్రాయం కలుగుతోంది. రెండు రాష్ట్రాలకు చెందిన పద్మా పురస్కార గ్రహీతలకు, ముఖ్యంగా పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకోనున్న వెంకయ్య, చిరంజీవిలకు సన్మానం చేయడం ద్వారా రేవంత్ అటు కేంద్రానికీ, ఇటు జగన్ ప్రభుత్వానికీ సంకేతాలు పంపారు. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామంటూనే వెంకయ్యనాయుడు రాష్ట్రపతి కావాలని ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోరుకోవడం రాజకీయ సందేశమే. రెండవది, సామాన్యుల్లో అసామాన్యులైన వ్యక్తులకు మోదీ ప్రభుత్వం పద్మా పురస్కారాలు ఇవ్వడం గొప్ప విషయమే అయినప్పటికీ కేవలం ఈ పురస్కారాల వల్ల ఏమి ఒరుగుతుంది?

ప్రయాణ ఖర్చులు కూడా పెట్టుకోలేని వారికి చప్పట్ల వల్ల, దుప్పట్ల వల్ల ఏమి ప్రయోజనం? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసిన ప్రశ్న కూడా యోచించదగిందే. నిజానికి పద్మా పురస్కారాలు పొందినవారు అనేకమంది దుస్థితి వర్ణనాతీతం. ఒడిషాలో గత కొన్నేళ్లుగా పద్మశ్రీ పురస్కారాలు లభించిన 83 మందిలో పలువురు చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఒడిషా ప్రభుత్వమే ప్రకటించింది. ఆ రాష్ట్రంలో దైతరీ నాయక్ అనే వ్యక్తి గోనసికా పర్వతాన్ని తానొక్కడే మూడేళ్ల పాటు శ్రమించి త్రవ్వి కాలువ నిర్మించడంతో ఆ ప్రాంతంలో దాదాపు వంద ఎకరాలకు సాగు నీరు లభించింది. పద్మశ్రీ పురస్కారం లభించిన తర్వాత తనకు కూలీగా కూడా ఎవరూ పని ఇవ్వలేదని ఆయన వాపోయారు. పేదరికంతో మగ్గుతున్న దైతరీ నాయక్ దుస్థితి గురించి పేపర్లలో వార్త చదివిన తర్వాత స్పందించిన ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆయనకు నెలకు రూ. పదివేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఇటీవలే శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగిన అయోధ్యలో మొహల్లా ఖిర్కీ అలీబెయిగ్‌లో నివసించే మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తికి నాలుగేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చింది. గత పాతికేళ్లుగా ఇదే అయోధ్యలో ఆయన 25వేల అనాథ శవాలకు అంత్యక్రియలు చేస్తూ వచ్చారు. చనిపోయిన వారు ఏ మతం అన్న దానితో నిమిత్తం లేకుండా ఆయన వారి వారి ఆచారాల ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. కాని ఇదే మహమ్మద్ షరీఫ్ ఇవాళ దుర్భర పేదరికంతో, అనేక జబ్బులతో కునారిల్లుతూ తానే ఒక శవంలా పడి ఉన్నారని వార్తలు వచ్చాయి.

## అక్కడ అవిశ్వాసం... ఇక్కడ చీలిక!



**జిన్నారం :** జిన్నారం మండలంలో రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతున్నది. కాంగ్రెసకు చెందిన ఎంపీపీపై బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టగా.. బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్ఎసకు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరారు.

జిన్నారం మండల పరిషత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ (కాంగ్రెస)పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన 5 మంది ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవోకు నోటీసులు ఇచ్చారు. మండలంలో మొత్తం 8 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి నలుగురు సభ్యులు ఎన్నికయ్యారు. దీంతో మండల పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి లాటరీ తీయగా కాంగ్రెసకు ఎంపీపీ పీఠం దక్కింది. అనంతరం కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎంపీటీసీలు బీఆర్ఎసలో చేరారు. అదే సమయంలో బీఆర్‌సకు చెందిన ఒకరు కాంగ్రెస్ గూటికి చేరారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వైపు ఐదుగురు, కాంగ్రెసకు ముగ్గురు ఎంపీటీసీలు ఉన్నారు. దీంతో అవిశ్వాస సమావేశం నిర్వహిస్తే బీఆర్ఎసకే సంఖ్యా బలం ఉన్నది. మండలంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడ అయిన బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్ఎసకు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెసలో చేరారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎసకు చెందిన రోజారాణి బాల్‌రెడ్డి ఉన్నారు. ఆ పార్టీకి ఇంకా 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎసకు చెందిన సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి వర్గానికి, చైర్‌పర్సన్ వర్గానికి మొదటి నుంచి ఉప్పు నిప్పులా ఉండేది. నిధుల కేటాయింపులో, పార్టీలో కార్యక్రమాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని చంద్రారెడ్డి వర్గం అసంతృప్తితో ఉన్నారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులపై నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని 5వ తేదీన జరిగిన మున్సిపల్ సమావేశాన్ని వారు బహిష్కరించారు. బీఆర్ఎసకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

## రోగులు ఏమవుతున్నారు?

## సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మిస్సింగ్స్




**సంగారెడ్డి :** గుమ్మడిదల మండలం అన్నారం గ్రామానికి చెందిన తలారి సాయికుమార్(25)కు ఫిట్స్ రావడంతో బంధువులు జనవరి 10న సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇన్‌పేషంట్‌గా చేర్చుకున్న వైద్యులు చికిత్స ప్రారంభించారు. జనవరి 13న సాయికుమార్ మూత్రానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

బంధువులు ఆసుపత్రి చుట్టుపక్కల, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని సోదరి భాగ్యలక్ష్మి సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంగారెడ్డి పట్టణంలోని ఇంద్రకాలనీకి చెందిన పట్నం జగన్నాథం(75) గత ఏడాది డిసెంబరు 1న ఉదయం 9.30 గంటలకు వైద్యం కోసం భార్య లక్ష్మితో కలిసి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో చూపించుకున్న తర్వాత ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో కనిపించకుండా పోయాడు. జహీరాబాద్ మండలం రాయిపల్లికి గ్రామానికి చెందిన ఎరుకల రమేష్(52) రమేష్ ఎడమ కాలికి గాయమైందని కుమారుడు ఎరుకల నర్సిములు గత ఏడాదిఅక్టోబరు 19న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ అక్టోబరు 20 ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఎరుకల రమేష్ బీడీ తాగి వస్తానని చెప్పి, బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆరోగ్యం బాగు చేయించుకుందామని ఆసుపత్రికి వస్తున్న కొందరు బాధితులు కనిపించకుండా పోతున్నారు. నెలలు గడిచినా వారు ఎక్కడున్నారు.. ఎక్కడికి వెళ్లారు అన్నది మిస్టరీగా మారింది. వారి కోసం బంధువులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ చిక్కడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసి.. తమ వారి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఏడాదిలో పదుల సంఖ్యలో ఆసుపత్రి నుంచి మిస్సింగ్ కేసులు నమోదవుతున్నా ఇటు ఆసుపత్రి వర్గాలు.. అటు పోలీసులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన వారు కనిపించకుండా పోతుండటంతో వారి బంధువులు తట్టుకోలేకపోతున్నారు. నిన్నామొన్నటి వరకు తమలో ఒకరిగా.. కష్టసుఖాల్లో పాలుపంచుకున్నవారు ఉన్నఫలంగా అదృశ్యం కావడం వెనుక కారణాలు తెలియక ఆవేదన చెందుతున్నారు. తమ వారి ఆచూకీ కోసం పోలీసస్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా.. వారి జాడ మాత్రం తెలియడం లేదు. పోలీసుశాఖలో ఖాళీలు ఎక్కువగా ఉండడం, ఉన్న సిబ్బంది రోజువారీ విధులకు సరిపోవడంతో తప్పిపోయినవారి జాడ తెలుసుకొనేందుకు సమయం సరిపోవడం లేదు.

జిల్లాకేంద్రంలో వీఐపీల పర్యటనలు, ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాలు ఎక్కువగా ఉండడంతో పోలీసులు బందోబస్తుకే సరిపోతున్నారు. కనిపించకుండా పోతున్నవారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆచూకీ 24 గంటల్లో తెలియకపోతే సంబంధిత పోలీసస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలి. సదరు వ్యక్తి ఫొటో, వివరాలు అన్ని పోలీసస్టేషన్లలకు పంపి, ప్రసారమాధ్యమాల్లో వచ్చేలా చూడాలి. సదరు వ్యక్తి తరచూ సందర్శించే స్థలాల్లో విచారణ జరపాల్సి ఉంటుంది. కానీ, ఇవన్నీ చేసేందుకు తీరిక లేక పోలీసులు మిస్సింగ్ కేసులను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తప్పిపోయిన వారి బంధువులు పోలీసస్టేషన్‌ల చుట్టూ తిరుగుతున్నా పోలీసులు మాత్రం చూస్తాం... వారి జాడ తెలిస్తే మేమే కబురు పెడతామంటూ సమాధానమిస్తున్నారు.

### నామ్‌కే వాస్తేగా పోలీస్ అవుట్ పోస్టు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టు పేరుకు మాత్రమే ఉంది. అక్కడ పోలీసు సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండరు.

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన రాజన్ బాబు...

అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యా లు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫొటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫొటో తో చెప్పడం సాధ్యం. అంతటి శక్తి వంతమైనది ఫొటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫోటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం. బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగష్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణం లో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న అవిభక్త కరీంనగర్, నేటి జగిత్యాల జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి అరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు. బాల్యంలో రంగులు వేయ డం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు, మంచి చిత్రకారుడు కావల్సి ఉండ గా, కుంచె నుండి కెమేరాకు మార డం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నప్పుడు తన కజిన్ బహూకరించిన సాధారణ కొడాక్ 620 కెమేరాతో తీసిన చిత్రా లు పెక్కుమంది ప్రశంసలు అందు కొని రాజన్ లోని ఛాయాగ్రాహ కుడిని వెలికి తీసింది. హైదరా బాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రహ కుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలవటం జరిగింది. రాజా త్రయంబక్ రాజా, రాజన్ బాబును కుంచె స్థానంలో కెమేరా పట్టుకోమన్న సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడ యి, కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు.

తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటొగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫొటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రహకులుగా తీర్చిదిద్దారు.

ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయా చిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడెమీ ఆఫ్ ఫోటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయా గ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు. డిజిటల్ ఛాయా గ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు డార్క్ రూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయ టానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయ నిక సూత్రం పై ద్రవణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో...చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రోక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటొషాప్ లాంటి సాఫ్ట్వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భు తాలు చేశారు. తన కళా నైపుణ్యం తో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శిం చి, పలువురి ప్రశంసలందు కున్నారు.

రాజన్ తీసిన నగ్న చిత్రా లలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి.

కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠా లలో భాగంగా బోధించ టానికై, చాలా కెమేరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హోదాకు చిహ్నమైన Hasselblad-medium format camera కూడా ఉంది. ఫిల్మ్ కెమేరా Asahi Pentax నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ Canon 400Dవాడే వాతు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు రాజన్ బాబు. ఛాయాగ్రహణం ఒక భాషైతే, అందు లోని వ్యాకరణమే Composition, Color Space, Form, Proper Exposure, Angle and Light అని వివ రించే వారు. ఈ మెళకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకు డవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటొగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగష్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరాబాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫోటోగ్రఫీ కళా కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.

అలాంటి శక్తిని వశం చేసుకుని ఫోటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు.

కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం. బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగష్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణం లో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న అవిభక్త కరీంనగర్, నేటి జగిత్యాల జిల్లా కోరుట్లలో జన్మించారు.

# అమెరికా దాడిలో ఇరాన్ మద్దతున్న కీలక కమాండర్ మృతి



వాషింగ్టన్: ఇరాక్‌లోని మిలిటెంట్ల స్థావరాలపై బుధవారం జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ మద్దతున్న ఓ కీలక కమాండర్ హతమైనట్లు అమెరికా సైన్యం ప్రకటించింది.మధ్యప్రాచ్యంలోని అగ్రరాజ్య స్థావరాలపై జరుగుతున్న దాడుల్లో అతడి హస్తం ఉందని తెలిపింది.

జోర్డాన్‌లో ఇటీవల ముగ్గురు అమెరికా సైనికుల మరణానికి ప్రతీకారంగానే తాము ఈ దాడి చేశామని వివరించింది. బాగ్దాద్‌లో కారులో వెళ్తున్న కమాండర్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు సైనికాధికారి ఒకరు వెల్లడించారు. ఈ ఘటనలో సామాన్య పౌరులు మరణించిన ఆనవాళ్లు లేవని తెలిపారు. కేవలం కారు మాత్రమే దగ్ధమైనట్లు చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

బహుశా ఆర్9ఎక్స్ అనే హెల్‌ఫైర్ రకం క్షిపణిని ఉపయోగించి ఉంటారని అమెరికా మాజీ సైనికాధికారి ఒకరు తెలిపారు. పేలుడు తీవ్రత ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. 2020లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక కమాండర్ ఖాసీమ్ సులేమానీని సైతం అమెరికా ఇదే తరహాలో హతమార్చింది.

# పాక్ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఓటు హక్కును కాలరాస్తున్న పురుషాధిక్యత



పాకిస్తాన్ : పాకిస్థాన్ గ్రామీణ ప్రాంతాల్లో పితృస్వామ్య పురుషాధిక్య భావజాలం అక్కడి మహిళల ఓటు హక్కును కాలరాస్తోంది. వయోజనులందరికీ ఓటు వేసే హక్కు వున్నప్పటికీ సామాజికంగా ఛాందసవాద భావాలు కలిగిన పాక్‌లోని మారుమూల ప్రాంతాల్లో ఇంకా గ్రామపెద్దల పితృస్వామ్య వ్యవస్థ చెల్లుబాటు అవుతోంది. వారి కమ్యూనిటీల్లో వీరు గట్టి ప్రభావాన్ని చూపిస్తారు. పంజాబ్‌లోని దుర్నాల్ గ్రామంలో 50 ఏళ్ళ పై చిలుకు నుండి ఈ నిషేధం అమలవుతోంది. ఇందుకు వారు అనేక చిల్లర కారణాలను చూపిస్తారు.

పురుషులతో బాటూ ఆడవారు కూడా ఓటు వేయడానికి వెళితే ఇంట్లో పనిపాటలు, పిల్లల సంరక్షణ ఎవరు చూస్తారు? అని కొంతమంది, స్థానిక అల్లర్లు, ఘర్షణల నుండి ఆడవారిని కాపాడేందుకే అని మరికొందరు సాకులు చెబుతున్నారు.

# కేంద్ర వైఖరిపై కర్ణాటక నిరసన...



**న్యూఢిల్లీ :** కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా చెల్లించే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష ప్రదర్శిస్తోందని ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలు మండిపడ్డాయి. ఇప్పటికే కేరళ, తమిళనాడు, తెలంగాణ ప్రభుత్వాలు కేంద్ర వైఖరిపై గళం విప్పగా తాజాగా కర్నాటక కూడా గొంతు కలిపింది.

కర్నాటకకు 15వ ఆర్థిక సంఘం చేస్తున్న అన్యాయంపై ఆ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు బుధవారం రాజధాని న్యూఢిల్లీలో ఆందోళన నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం వైఖరి కారణంగా రాష్ట్రానికి గత ఐదు సంవత్సరాల్లో రూ. 1,87,000 కోట్ల నష్టం వాటిల్లిందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల విలేకరుల సమావేశంలో విమర్శించారు. రాష్ట్రంలో నీటి పారుదల, అభివృద్ధి ప్రాజెక్టుల అమలులో కేంద్రం జాప్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటా 4.71% నుండి 3.64%కి తగ్గిందని గుర్తు చేశారు. దీనివల్ల పన్నుల్లో రూ. 62,098 కోట్లు నష్టపోయామని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.


# ఏపిలో నిర్మాణం పూర్తికాని ఇళ్లు 1,78,951



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్‌లో 1,78,951 ఇళ్లు ఇంకా పూర్తి కాలేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పిఎంఎవై-జి కింద ఫిబ్రవరి 1 నాటికి ఏపికి 2,46,430 ఇళ్లు మంజూరు కాగా, 67,479 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి.

1,78,951 ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. తెలంగాణకు ఒక్క ఇళ్లు కూడా మంజూతు కాలేదని మంత్రి తెలిపారు. కాగా తిరుపతి ఐఐటి క్యాంపస్ శాశ్వత భవనం నిర్మాణానికి సంబంధించిన సివిల్ వర్క్స్, ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్ కొనుగోలు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1091.75 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ పేర్కొన్నారు.

# సెనెగల్ అధ్యక్ష ఎన్నికల వాయిదాపై పెల్లుబికిన ఆగ్రహం



**దకర్ :** సెనెగల్ అధ్యక్ష ఎన్నికలను ఈ ఏడాది డిసెంబరు 15కి వాయిదా వేస్తూ సోమవారం అర్థరాత్రి దాటిన తర్వాత నేషనల్ అసెంబ్లీ డిప్యూటీలు ఓటు వేయడంపై ఆ దేశంలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ఇది రాజ్యాంగ కుట్ర అంటూ పౌర సమాజం, రాజకీయ సంస్థలు తీవ్రంగా నిరసించాయి. సోమవారం పార్లమెంట్ సమావేశమైనపుడు, అధ్యక్షుడు మాకీ సాల్ నియంత అంటూ ఆందోళనకారులు పార్లమెంట్ వెలుపల నినాదాలు చేశారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నిక జరపాలంటూ డిమాండ్ చేశారు. దాంతో నిరసనకారులపై బాష్పవాయు గోళాలతో పోలీసులు విరుచుకుపడ్డారు. రాజధానిలోని పలు ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు. శాంతియుతమైన, ప్రజాస్వామిక దేశమైన సెనెగల్‌లో ఈ అధ్యక్షుడు తమకు న్యాయం, స్వేచ్ఛ ఇవ్వడం లేదని ఆందోళనకారుడు వ్యాఖ్యానించారు. అధ్యక్ష ఎన్నికను కేవలం రాజ్యాంగ మండలి మాత్రమే వాయిదా వేయగలదని పేర్కొన్నారు. అలా వాయిదా వేయడంపై కూడా అనేక నియంత్రణలు వున్నాయి. అటువంటి కీలకమైన విషయంలో చర్యలు తీసుకున్న తీరు పూర్తి రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఇది రాజ్యాంగ కుట్ర కిందకే వస్తుందని తెలిపారు. నేషనల్ అసెంబ్లీ నుండి ప్రతిపక్షాల డిప్యూటీలను పోలీసులు బలవంతంగా తొలగించిన తర్వాత ఓటింగ్ జరిగింది. అధ్యక్ష ఎన్నికను వాయిదా వేయడానికి అనుకూలంగా 105 మంది ఎంపీలు ఓటు వేయగా, ఒక్కరు మాత్రమే వ్యతిరేకించారు. ఇక తన వారసుడిని ఎంపిక చేసుకునే వరకు ప్రస్తుత అధ్యక్షులు మాకీ సాల్ అధికారంలో కొనసాగుతారు. వాస్తవానికి ఏప్రిల్ 2తో ఆయన పదవీకాలం ముగియనుంది. తొలుత ఫిబ్రవరి 25న జరగాల్సిన ఈ ఎన్నికను నిరవధికంగా నిలుపు చేస్తున్నట్లు ఫిబ్రవరి 3న ప్రకటించారు. తిరిగి 5వ తేదీన పార్లమెంట్ నుండి ప్రతిపక్ష సభ్యులను బలవంతంగా తొలగించిన తర్వాత డిసెంబరు 15కి ఎన్నికలను వాయిదా వేస్తూ పార్లమెంట్ ఓటు వేసింది.

అధ్యక్ష ఎన్నికను కేవలం రాజ్యాంగ మండలి మాత్రమే వాయిదా వేయగలదని పేర్కొన్నారు. అలా వాయిదా వేయడంపై కూడా అనేక నియంత్రణలు వున్నాయి. అటువంటి కీలకమైన విషయంలో చర్యలు తీసుకున్న తీరు పూర్తి రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఇది రాజ్యాంగ కుట్ర కిందకే వస్తుందని తెలిపారు.

# పాకిస్తాన్ లో ఓటింగ్ ప్రారంభం



**పాకిస్తాన్ :** నగదు కొరత ఉన్న దేశాన్ని పాలించడానికి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు పాకిస్థానీయులు ఫిబ్రవరి 8న సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ ప్రారంభించారు. ఉదయం 8.00 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5.00 గంటల వరకు విరామం లేకుండా కొనసాగుతుంది. మొత్తం 1,28,58,57,60 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ సెలవు దినాన్ని ప్రకటించారు. ఓటింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా 12.85 కోట్ల మంది నమోదిత ఓటర్లు 90,000 పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనుండటంతో దాదాపు 6,50,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. ఉగ్రవాద ముప్పు కారణంగా మొబైల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని పాకిస్థాన్ నిర్ణయించింది. పాకిస్తాన్ ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం, నేషనల్ అసెంబ్లీ (ఎన్.ఎ) స్థానాలకు మొత్తం 5,121 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో 4807 మంది పురుషులు, 312 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నాలుగు ప్రావిన్షియల్ అసెంబ్లీలకు 12,123 మంది పురుషులు, 570 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు సహా 12,695 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు.మొత్తం 336 స్థానాలకు గాను 266 ఎన్.ఎ స్థానాలు కైవసం చేసుకోవలసి ఉంది, అయితే బజౌర్‌లో తుపాకీ దాడిలో అభ్యర్థి మరణించడంతో ఒక స్థానానికి పోలింగ్ వాయిదా పడింది.

# పప్పు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.....?

మామూలుగా చాలామంది ఈవినింగ్ సమయంలో స్నాక్స్ గా పుట్నాల పప్పును ఎక్కువగా తింటూ ఉంటారు. మీకు తెలుసా ఈ పుట్నాల పప్పు వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి.వీటిని తరచుగా తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. ప్రతిరోజు పుట్నాల పప్పు తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా దృఢంగా ఉంటుంది. ఇందులో అధిక మోతాదులో ఫైబర్ కూడా లభిస్తుంది. ప్రతిరోజు తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలతో పాటు శరీర బరువు కూడా నియంత్రణలో ఉంటుంది.

దీంతోపాటు కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.ఇందులో కొవ్వు పరిమాణాలు కూడా చాలా తక్కువగా లభిస్తాయి. కాబట్టి శరీరంలోని కొలెస్ట్రాల్ పరిమాణాలు సులభంగా తగ్గిపోయి. చెడు కొవ్వు మంచి కొవ్వుగా మారుతుందని నిపుణులు అంటున్నారు. ఈ పప్పులో ఫోలేట్, ఐరన్, ఫాస్పరస్, మాంగనీస్ వంటి పోషకాలు అధికం మోతాదులో లభిస్తాయి. కాబట్టి ప్రతిరోజు తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఈ పుట్నాల పప్పులలో శరీరానికి అవసరమైన పోషక గుణాలు మినరల్స్ అధిక మోతాదులో లభిస్తాయి. అంతేకాకుండా గుండెకు మేలు చేసే అనేక రకాల ఔషధ గుణాలు లభిస్తాయి. కాబట్టి ప్రతిరోజు వీటిని సాయంత్రం పూట స్నాక్స్‌గా తినడం వల్ల బోలెడు లాభాలు కలుగుతాయి. ఇందులో ఉండే ఫైబర్ శరీరంలోని కొలెస్ట్రాల్ పరిమాణాలను కూడా నియంత్రించేందుకు సహాయపడుతుంది. అలాగే ఇందులో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా లభిస్తాయి. కాబట్టి ప్రతిరోజు తీసుకోవడం వల్ల రక్తంలోని చక్కెర పరిమాణాలు కూడా నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా పుట్నాల పప్పులో లభించే ఫైబర్ పరిమాణాలు జీర్ణక్రియను మెరుగుపరచి పొట్ట సమస్యలు అయినా మలబద్ధకం, ఉబ్బరం, పొట్టనొప్పి వంటి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తుంది.

ముఖ్యంగా శీతాకాలంలో తీసుకోవడం వల్ల వాతావరణంలోని తేమ పెరగడం కారణంగా వచ్చే ఇన్ఫెక్షన్లు కూడా దూరమవుతాయి. కాబట్టి తరచుగా చలికాలంలో ఇన్ఫెక్షన్ల సమస్యలు, రోగ నిరోధక తగ్గడం వంటి సమస్యలతో బాధపడేవారు తప్పకుండా పుట్నాల పప్పును తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి సాయంకాలం సమయంలో పిల్లలకు స్నాక్స్ గా వీటిని పెట్టడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కూడా కలుగుతాయి.



## అంబలితో ఆరోగ్య ప్రయోజనాలు..



అంబలి చాలా మందికి తెలుసు. మన పెద్దవారు చెబుతుంటారు.. మేము జొన్న గడుక, అంబలి తాగి పెరిగాము అందుకే,డెబ్బై, ఎనభై వయసులో కూడా కొంత పని చేయగలుగుతున్నామని. ఎందుకంటే మనం రోజూ తినే చికెన్ మటన్, అన్నం కంటే అంబలి ఆరోగ్యానికి చాలా మంచిదంట. ఇందులో ఎక్కువ పోషక విలువలు ఉంటాయి.

మరీ ముఖ్యంగా జొన్నలతో చేసే అంబలి తీసుకొవడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవంట. జొన్నల్లో క్యాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటి వాటితో పాటు పీచు పదార్థాలు కూడా ఎక్కువగా ఉంటాయి. జొన్నలతో రొట్టెలే కాకుండా అంబలిని కూడా తయారు చేసుకుని తాగవచ్చు. జొన్న అంబలిని తాగడం వల్ల రుచితో పాటు చక్కటి ఆరోగ్యాన్ని కూడా సొంతం చేసుకోవచ్చు. జొన్న పిండితో అంబలిని తయారు చేసుకుని తాగడం వల్ల మన శరీరానికి కావల్సిన పోషకాలన్నీ లభిస్తాయి.గుండె ఆరోగ్యంగా పని చేస్తుంది. షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా ఈ అంబలిని తాగడం వల్ల కండరాలు ధృడంగా తయారవుతాయి.శరీరంలో వేడి తగ్గుతుంది. అలాగే నీరసం, బలహీనత వంటి సమస్యలు తగ్గుతాయి. ఎముకలు ధృడంగా తయారవుతాయి.

## ఇమ్యూనిటీని పెంచుకోవాలనుకుంటున్నారా?



కరోనా మహమ్మారి తర్వాతప్రతి ఒక్కరూ కూడా ఆరోగ్యం పై పూర్తి జాగ్రత్తలు వహిస్తున్నారు. అంతేకాకుండా ఆరోగ్యం విషయంలో స్పెషల్ కేర్ కూడా తీసుకుంటున్నారు అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఒంట్లో రోగ నిరోధక శక్తి తక్కువ కాకుండా చూసుకుంటున్నారు. ఇక ఇమ్యూనిటీ పవర్ పెంచుకోవడం కోసం ఏవేవో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. సరైన విధంగా ఆహార పదార్థాలు కాయగూరలు తీసుకోవడంతో పాటు కొన్నిరకాల ఆహార పదార్థాలను మన డైట్ లో చేర్చుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్ ను పెంచుకోవచ్చు. ఒంట్లో రోగనిరోధక శక్తి తక్కువైతే కరోనా లాంటి వైరస్ ను శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఒక్క కరోనా వైరస్ అని మాత్రమే కాకుండా సీజన్ల ప్రకారంగా వచ్చే వైరస్ ల బారిన పడకుండా ఉండవచ్చు. అయితే బాడీలో ఇమ్యూనిటీ పవర్ ను పెంచుకోవాలని అనుకున్న వారు తీసుకోవాల్సిన వాటిలో సబ్జా గింజలు కూడా ఒకటి. ఇందుకు సబ్జా గింజలు చాలా ఉత్తమంగా పనిచేస్తాయి. సబ్జా గింజల్లో చాలా పోషకాలు ఉంటాయి. వీటిలో ఉండే బీటా కెరోటిన్, వైసెనిన్, ఓరింటిన్ లాంటి ఫ్లేవనాయిడ్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. సబ్జా గింజల్లో ఉన్నన్ని ఔషధ గుణాలు మరే గింజల్లో ఉండవు. ఇవి చూడటానికి చిన్నగా నల్లగా ఉన్నా వీటిని నీటిలో వేసి నానబెడితే తెల్లగా మారుతాయి. ముఖ్యంగా ఒంట్లో వేడి ఎక్కువైతే శరీరంలో ఉన్న వేడిని సబ్జా గింజలు ఇట్టే తగ్గించేస్తాయి. అలాగే మీకు తలనొప్పి వచ్చినా ఒంట్లో నీరసంగా ఉన్నా కొన్ని సబ్జా గింజలను తీసుకొని వాటిని నీళ్లలో కలుపుకొని తాగడం మంచిది. సబ్జా గింజల్లో ఉండే మరో మంచి గుణం ఏంటంటే.. ఇవి రక్తాన్ని శుద్ధి చేస్తాయి. అలాగే శరీరంలో ఉన్న మలినాలను ఇవి తొలగించేస్తాయి. మలబద్ధక సమస్యలు ఉన్నా కూడా వీటిని రాత్రి పూట పాలల్లో కలుపుకొని తాగితే మలబద్ధక సమస్య వెంటనే తగ్గుతుంది. సబ్జా గింజలు షుగర్ ను కంట్రోల్ లో ఉంచేందుకు మంచి ఔషధంలా పనిచేస్తాయి.

వారంలో ఒకరోజు సబ్జా గింజలతో చేసిన జ్యూస్ తాగితే షుగర్ కంట్రోల్ అవుతుంది. బాడీలో షుగర్ లేవల్స్ ను పెరగకుండా ఇవి అదుపులో ఉంచుతాయి. అందుకే షుగర్ పేషెంట్లు సబ్జా గింజలతో చేసిన జ్యూస్ ను అప్పుడప్పుడు తాగుతుండాలి.

## తులసి కషాయం ప్రయోజనాలు..?

తులసి వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. హిందువులు తులసి మొక్కను పరమ పవిత్రంగా భావించడంతో పాటు పూజలు కూడా చేస్తూ ఉంటారు. తులసి మొక్క కేవలం ఆధ్యాత్మిక పరంగానే కాకుండా ఆరోగ్యపరంగా కూడా ఎంతో మేలు చేస్తుంది. ఆయుర్వేదంలో ఎప్పటి నుంచో ఈ తులసి ఆకులను వినియోగిస్తూనే ఉన్నారు. తులసిని తరచుగా తీసుకోవడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అలాగే తులసి కషాయం వల్ల కూడా ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా పరగడుపున తులసి కషాయం తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.మరి తులసి కషాయం పరగడుపున తీసుకుంటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. తులసి కషాయం ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగితే మెదడు చురుకుగా పనిచేస్తుందిం అంతేకాదు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తులసి రసంలో తేనె కలుపుకొని తాగితే కిడ్నీలో ఉండే రాళ్లు కరిగిపోతాయి.

అల్లం రసంతో తులసి రసాన్ని కలిపి తాగితే కడుపు నొప్పి తగ్గుతుంది. పొట్టలో ఉండే నులి పురుగులు నసిస్తాయి. జలుబు చేసినప్పుడు తేనెలో ఒక టేబుల్ స్పూన్ తో తులసి రసం కలుపుకొని తాగితే ఉపశమనం లభిస్తుంది. బెల్లంతో తులసి ఆకులు కలిపి తింటే కామెర్లు తగ్గుముఖం పడతాయి.



అంతేకాకుండా తులసి ఆకులు జ్వరాన్ని తగ్గిస్తుంది. అల్సర్ల నుండి రక్షిస్తుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగకుండా నియంత్రిస్తుంది.

కాలేయం శక్తివంతంగా పనిచేయడానికి దోహదపడుతుంది. నోటి నుండి దుర్వాసన వెలువడకుండా నిషేధిస్తుంది. అలర్జీలు, పొగ ,దుమ్ము నుండి శరీరానికి కలిగే హానిని అరికడుతుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. దాదాపు అందరూ ఇళ్లలోనూ ప్రధాన ద్వారానికి ఎదురుగా తులసి మొక్క ఉంటుంది.

ఎందుకంటే తులసి ఆకుల నుంచి వచ్చే సువాసన ఇల్లంత పరుచుకొని మంచి యాంటీబయోటికగా పని చేస్తూ వ్యాధులు రాకుండా చేస్తుందని నమ్మకం అందుకే చాలా దేవాలయాలలో తీర్థంలో తులసి దళాలను వేస్తారు.

## నిత్య యువ్వనంగా కనిపించాలనుకుంటున్నారా..?



మునగాకు వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. మునగాకును వేల సంవత్సరాల క్రితం నుంచి ఒక ఔషధముల ఉపయోగిస్తున్నారు. ఈ మునగాకును ఉపయోగించి ఆయుర్వేదంలో ఎన్నో రకాల మందులు కూడా తయారు చేస్తూ ఉంటారు.

అందుకే డాక్టర్లు కూడా తరచుగా మునగ ఆకులు తినమని చెబుతూ ఉంటారు. మునగాకు కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా అందానికి సంబంధించిన విషయాలలో కూడా ఎంతో బాగా పనిచేస్తుంది. ఇందులో విటమిన్ ఏ విటమిన్ బి, విటమిన్ సి, విటమిన్ కే, కాలుష్యం మెగ్నీషియం ఫాస్ఫరస్ ఎక్కువ శాతం కలిగి ఉంటుంది. మునగాకు రసం తాగడం మంచిది. ప్రతిరోజు మునగాకుల రసం తాగడం వలన పేగుల కదలికలు కలిగి సులువుగా మోషన్ జరుగుతుంది. మునగాకులో యాంటీ ఇంప్లిమెంటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి.ఈ రసాన్ని తాగడం వలన నొప్పి వాపు కు ఉపశమనం కలుగుతుంది. ప్రతిరోజు మునగాకు జ్యూస్ మూడుసార్లు మూడు నెలలు పాటు తాగడం వలన రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి.

షుగర్ లెవల్సింది అదుపులో ఉంచే మునగాకు రసాన్ని ఇంట్లో సులువుగా తయారు చేసుకోవచ్చు. గుండె జబ్బులు చాతిలో నొప్పి శరీరంలో కొలెస్ట్రాల్ అని పిలిచే చెడు కొలెస్ట్రాల్ దీనికి పరిష్కారం గా మునగాకు రసాన్ని తాగడం శ్రేయస్కరం.ఈ రసాన్ని తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను మన శరీరం నుంచి తొలగించవచ్చు. ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్న మునగాకు శరీరానికి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయం పడుతుంది. బ్యాక్టీరియా లక్షణాలు కలిగి ఉండడంతో బాక్టీరియా పెరగకుండా చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు రాకుండా నివారించే గుణం ఇందులో ఎక్కువగా ఉంటుంది. ఈ మునగాకు జ్యూస్ ప్రతిరోజు తాగడం వలన తాగడం వలన వృద్ధాప్యం ఆలస్యం అవుతుంది. సెల్ డామేజ్ కాకుండా చేసి చర్మం యొక్క స్థితిస్థాపకతను తగ్గిస్తుంది.ముడతలు రాకుండా చర్మం ప్రకాశవంతంగా మరియు యవ్వనంగా కనిపిస్తుంది. మొటిమల సమస్యలను తొలగిస్తుంది. మునగాకు రసాన్ని ప్రతిరోజు తాగడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాగే విటమిన్లు మినరల్స్ మెరుగవుతాయి.

## కొబ్బరి నూనెతో షుగర్ పేషేంట్లకు లాభమా!




ఈ రోజుల్లో చాలామంది డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ డయాబెటిస్ కారణంగా ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగడం, తగ్గడం లాంటి సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు.రక్తంలో షుగర్ లెవల్ ను అదుపులో ఉంచుకోవడానికి ఎన్నో రకాల చిట్కాలను ఉపయోగిస్తూ ఉంటారు. అలాగే రకరకాల మెడిసిన్స్ ని కూడా ఉపయోగిస్తూ ఉంటారు. అలాగే డయాబెటిస్ ఉన్నవారు ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్న కూడా సంకోచిస్తూ ఉంటారు. అయితే డయాబెటిస్ పేషెంట్లకు కొబ్బరి నూనె ఎంతో బాగా పనిచేస్తుంది అంటున్నారు నిపుణులు.

మరి కొబ్బరి నూనె వల్ల డయాబెటిస్ పేషెంట్లకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. కాగా షుగర్ ఉన్న వాళ్లు ఈ వంట నూనెల కన్నా.. కొబ్బరి నూనెను వంటనూనెగా వాడుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

మన దేశంలోని కేరళ రాష్ట్రంలో ఎక్కువ మంది కొబ్బరి నూనెతోనే వంటలు చేసుకుంటారు. కొబ్బరి నూనెతో వంట చేయడం వల్ల రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం. ఈ నూనెతో వంట చేసుకొని తినడం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్టరాల్ ను అది తగ్గిస్తుంది. అలాగే మన శరీరానికి హాని చేసే ట్రైగ్లిజరైడ్లను కూడా కొబ్బరి నూనె తగ్గిస్తుంది.

## గొంతునొప్పి వేధిస్తుందా....?



చలికాలంలో తరచుగా జలుబు, దగ్గు వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇవే కాకుండా ఈ సీజన్‌లో మరో సమస్య పెరుగుతుంది. అదే గొంతు ఇన్ఫెక్షన్ సమస్య. చల్లని వాతావరణంలో చాలా మంది తరచుగా గొంతు నొప్పితో బాధపడుతుంటారు. ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. దీని వెనుక చాలా కారణాలు ఉన్నాయి. కొన్నిసార్లు ఈ సమస్య చల్లటి, వేడి నీటిని తాగడం వల్ల వస్తుంది. దీని కారణంగా గొంతు నొప్పి రావడం సాధారణం. ఇలాంటి పరిస్థితిలో ప్రజలు గొంతు ఇన్ఫెక్షన్ సమస్యను నివారించడానికి అనేక రకాల ఇంటి నివారణలను ప్రయత్నిస్తారు. గొంతు నొప్పి, ఇన్ఫెక్షన్ సమస్య నుండి ఉపశమనాన్ని అందించే ఈ చాలా సులభమైన, ఎఫెక్టివ్ రెమెడీస్‌లో కొన్నింటిని ఈరోజు మేము మీకు తెలియజేస్తున్నాం. మీకు గొంతు నొప్పి లేదా ఇన్ఫెక్షన్ సమస్య ఉంటే ఉప్పు నీటితో పుక్కిలించండి. దీంతో ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుంది. దీని కోసం నాలుగు చెంచాల ఉప్పు తీసుకొని, ఆపై ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో వేసి కలపాలి. ఈ నీళ్లతో రోజుకు మూడు నాలుగు సార్లు పుక్కిలించడం వల్ల ఉపశమనం కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. పసుపు ఔషధ గుణాలతో నిండి ఉంది. దాని వినియోగం అనేక తీవ్రమైన వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మీరు గొంతు నొప్పిని ఎదుర్కోవటానికి చిటికెడు పసుపును గోరువెచ్చని పాలల్లో వేసుకుని త్రాగాల్సి ఉంటుంది. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న చమోమిలే టీ గొంతు ఇన్ఫెక్షన్, నొప్పుల నుండి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కళ్ళు, ముక్కు, గొంతు సమస్య నుండి ఉపశమనం అందించడంలో సహాయపడతాయని వైద్యులు చెబుతున్నారు. మీ గొంతు సమస్య ఉంటే మీకు మాట్లాడటంలో ఇబ్బంది ఉంటే మీరు ఆవిరి పట్టవచ్చు.

# మరోసారి 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన గౌతమ్ ఆదానీ

క్లబ్‌లో చేరిన గౌతమ్ ఆదానీప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ ఆదానీ ఆస్తి పెరిగిపోతోంది. 2023 యూఎస్ ఆధారిత షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల తర్వాత ఆదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ ఆదానీ తన సంపదను పెంచుకున్నారు. ఇప్పుడు రూ.100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిపోయారు. బ్లూమ్‌బెర్గ్ వార్త సంస్థ ప్రకారం..

ఆదానీ నికర విలువ బుధవారం 100.7 బిలయన్ల డార్లకు పెరిగింది. అతను ప్రపంచంలోని 12వ ధనవంతుడు. ఆదానీ ఈ ఏడాది 16.4 బిలియన్ డార్లను తిరిగి పొందినట్లు వార్త సంస్థ తెలిపింది. ఏడాది కిందట వివాదాస్పద హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ నికర విలువ 100 బిలియన్ డాలర్లు దాటడం ఇదే మొదటి సారి. అయితే గత ఏడాది జనవరి నాటికి అదానీ నికర విలువ సుమారు 120 బిలియన్ డాలర్లకు చేరుకోగా, అతను ప్రపంచంలో మూడవ అత్యంత సంపన్న వ్యక్తి అయ్యాడు. అదే సమయంలో హిండెన్‌బర్గ్ నివేదిక తీవ్ర నష్టాలను కలిగించింది.

మరోవైపు.. గౌమత్ అదానీ సంపద ఇటీవల భారీగా పెరిగిన క్రమంలో ప్రపంచ సంపన్నుల జాబితాలోనూ 12వ స్థానానికి చేరుకున్నారు. మార్కెట్ మానిప్యులేషన్, మోసం ఆరోపణల తర్వాత అదానీ సంపద $80 బిలియన్లకు పైగా క్షీణించింది. కానీ ఆ తర్వాత పుంజుకుంది. ఒక దశలో $150 బిలియన్ల కంటే ఎక్కువ మార్కెట్ విలువను కోల్పోయిన అతను పెట్టుబడిదారులను, రుణదాతలను వెనక్కి తిప్పికొట్టడానికి, రుణాన్ని తిరిగి చెల్లించడానికి, నియంత్రణ సమస్యలను తగ్గించుకునేందుకు కొన్ని నెలల సమయం పట్టింది. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. గౌతమ్ అదానీ ఇప్పుడు ప్రపంచంలోని అత్యంత సంపన్నుల జాబితాలో 12వ స్థానంలో ఉన్నారు. ముఖేష్ అంబానీ కంటే ఒక స్థానం వెనుకబడి ఉన్నాడు. అంబానీ ప్రస్తుతం ఫోర్బ్స్ జాబితాలో 111.4 బిలియన్ డాలర్లు నికర విలువతో 11వ స్థానంలో ఉండగా, బ్లూమ్‌బెర్గ్ ఇండెక్స్‌లో అతని నికర విలువ 107 బిలియన్ డాలర్లుగా ఉంది. జనవరిలో భారత సుప్రీం కోర్ట్ మూడు నెలల్లోగా గ్రూప్‌పై దర్యాప్తును ముగించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని ఆదేశించింది.

ఆదానీ నికర విలువ బుధవారం 100.7 బిలయన్ల డార్లకు పెరిగింది. అతను ప్రపంచంలోని 12వ ధనవంతుడు.




## టాటా గ్రూప్ కంపెనీకి కళ్లు చెదిరే లాభాలు




**న్యూఢిల్లీ :** టాటా గ్రూప్ రిటైల్ సంస్థ ట్రెంట్ డిసెంబర్ క్వార్టర్‌కు కళ్లు చెదిరే లాభాలు ఆర్జించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.155 కోట్ల నుంచి రూ.371 కోట్లకు దూసుకుపోయింది.140 శాతం వృద్ధి చెందింది. వెస్ట్‌సైడ్, జుడియో, స్టార్ పేరుతో రిటైల్ స్టోర్లను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఆదాయం 50 శాతం వృద్ధితో క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.2,303 కోట్ల నుంచి రూ.3,467 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 42 శాతం పెరిగి రూ.3,101 కోట్లుగా ఉన్నాయి. ''అన్ని ఫార్మాట్‌లలోనూ స్థిరమైన వృద్ధిని కొనసాగించాం.

నిర్వహణ క్రమశిక్షణ, వేగవంతమైన నిర్వహణ మా విస్తరణ అజెండాకు మద్దతుగా నిలిచాయి"అని సంస్థ తెలిపింది.వెస్ట్‌సైడ్, జుడియో స్థూల మార్జిన్ గతంలో మాదిరే స్థిరంగా కొనసాగింది. ఆపరేటింగ్ ఎబిట్ మార్జిన్ 13 శాతానికి పుంజుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 8.5 శాతంగానే ఉంది. బలమైన వృద్ధి విస్తరణ దిశగా తమకు మరింత ప్రోత్సాహాన్నిస్తున్నట్టు సంస్థ పేర్కొంది. వెస్ట్‌సైడ్ డాట్ కామ్, ఇతర టాటా గ్రూప్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అమ్మకాల్లో 5 శాతం వాటా ఆదాయం లభించినట్టు తెలిపింది. డిసెంబర్ క్వార్టర్‌లో కొత్తగా 5 వెస్ట్‌సైడ్ స్టోర్లు, 50 జుడియో స్టోర్లను ప్రారంభించింది.

## వైట్-కాలర్ జాబ్స్ డౌన్ జనవరిలో 11 శాతం తగ్గిన రిక్రూట్‌మెంట్లు





**ముంబై :** దేశవ్యాప్తంగా వైట్-కాలర్ ఉద్యోగ నియామకాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది తొలి నెలలో ఈ నియామకాలు 11 శాతం తగ్గినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఏడాది ప్రాతిపదికన జనవరి నెలలో ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు 19 శాతం తగ్గినట్లు, అయినప్పటికీ హెల్త్‌కేర్, ఆతిథ్య, ఎఫ్ఎంసీజీ రంగాల్లో మాత్రం పెరిగినట్లు నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్‌లో వెల్లడించింది.

నెలవారి జాబితాలో భాగంగా గత నెలకుగాను విడుదల చేసిన నివేదికలో కృత్రిమ మేధస్సుకు సంబంధించి మెషిన్ లెర్నింగ్ ఇంజినీరింగ్, ఏఐ సైంటిస్ట్ ఉద్యోగ నియామకాలు 46 శాతం, 23 శాతం చొప్పున పెరిగాయి. వార్షిక ప్రాతిపదికన హెల్త్‌కేర్ రంగంలో ఉద్యోగ కల్పన 7 శాతం అధికమవగా, వీరిలో అడ్మినిస్ట్రేటివ్ రోల్ సిబ్బందికి అధిక డిమాండ్ నెలకొన్నదని పేర్కొంది.

దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగం అంచనాలకుమించి దూసుకుపోతుండటంతో ఈ రంగంలో ఉద్యోగ నియామకాలు అంతకంతకు పెరుగుతున్నాయని, ముఖ్యంగా గత నెలలోనూ 5 శాతం పెరిగాయని తెలిపింది.

ముఖ్యంగా రెస్టారెంట్ మేనేజర్లు, సర్వీసు మేనేజర్లకు బెంగళూరు, ముంబైలలో డిమాండ్ ఎక్కువగా ఉన్నదని పేర్కొంది. మరోవైపు, బీపీవో రంగంలో నియామకాలు 16 శాతం తగ్గగా, బీమా రంగంలోనూ 8 శాతం తగ్గాయని పేర్కొంది. అలాగే విద్య, రిటైల్ రంగంలో కూడా 7 శాతం చొప్పున తగ్గాయి. ఈ సందర్భంగా నౌకరీ.

# రెపో రేటులో మార్పు లేదు.......




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ 2024 సంవత్సరానికి మొదటి ద్రవ్య విధానాన్ని సమర్పించారు. ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వెంటనే వచ్చిన ఈ ద్రవ్య విధానంలో రెపో రేటును మునుపటిలాగే 6.5 శాతంగా ఉంచారు.

భారతీయ రిజర్వ్ బ్యాంక్ మానిటరీ పాలసీ కమిటీ వరుసగా ఆరవ సారి పాలసీ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. దీని కారణంగా గృహ రుణం లేదా కారు రుణం ఇకపై సామాన్యులకు అందుబాటులో ఉండదు. ఇది మునుపటిలానే ఉంటుందని భావిస్తున్నారు.గతేడాది ఫిబ్రవరి మానిటరీ పాలసీలో ఆర్‌బీఐ రెపో రేటును 6.5 శాతానికి తగ్గించింది. ఇది ఇప్పుడు అలాగే ఉంచబడింది. ద్రవ్యోల్బణ నియంత్రణ ప్రధాన లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆర్బీఐ తన ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో రిజర్వ్ బ్యాంక్ చివరి ద్రవ్య విధానం.

దీని తరువాత తదుపరి ద్రవ్య విధానం ఏప్రిల్‌లో వస్తుంది. ఇది కొత్త ఆర్థిక సంవత్సరంలో మొదటి ద్రవ్య విధానం. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ ద్రవ్య విధానాన్ని సమర్పిస్తూ, "ప్రపంచ అనిశ్చితి మధ్య, దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని చూపుతోంది. ఒక వైపు ఆర్థిక వృద్ధి పెరుగుతోంది.

## భారత్‌లో రూ.1200కోట్ల పెట్టుబడులు పెట్టనున్న తైవాన్ కంపెనీ




తైవాన్ అతిపెద్ద కంపెనీ ఫాక్స్‌కాన్ భారతదేశానికి కొత్తేమీ కాదు. ఆపిల్ అతిపెద్ద తయారీదారు ఫాక్స్‌కాన్ భారతదేశంలో తన పట్టును మరింత బలంగా స్థాపించడానికి ప్రయత్నిస్తోంది.దీని కోసం కంపెనీ భారతదేశంలో సెమీకండక్టర్ వ్యాపారంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకుంది.

దీని కోసం కంపెనీ మొదట వేదాంతతో భాగస్వామిగా ఉంది, కానీ తరువాత ఫాక్స్‌కాన్ వేదాంతను విడిచిపెట్టవలసి వచ్చింది. ఇప్పుడు వచ్చిన వార్త చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఫాక్స్‌కాన్ దేశంలోని అతిపెద్ద దాతృత్వ సంస్థతో చేతులు కలిపింది. సెమీకండక్టర్ చిప్‌లపై ఫాక్స్‌కాన్‌తో కలిసి ఎవరి కంపెనీ పని చేస్తుంది.

ఫాక్స్‌కాన్ కూడా తన ఫ్యాక్టరీని స్థాపించడానికి 1200 కోట్ల రూపాయల పెట్టుబడిని ప్రకటించింది. దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త, దాతల సంస్థతో కలిసి ఫాక్స్‌కాన్ 'సెమికాన్'పై పని చేస్తుంది. రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం, తైవానీస్ ఎలక్ట్రానిక్స్ మేజర్ ఫాక్స్‌కాన్ భారతదేశంలో హెచ్‌సిఎల్ గ్రూప్ భాగస్వామ్యంతో చిప్ అసెంబ్లీ, టెస్టింగ్ ప్లాంట్‌ను నిర్మించడానికి బిడ్‌లను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రారంభ పెట్టుబడిగా రూ.1,200 కోట్లు వెచ్చించాలని కంపెనీ నిర్ణయించింది. ఇప్పటికే కొనుగోలు చేసిన సొంత స్థలంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఫాక్స్‌కాన్ తెలిపింది. అలాగే, ఈ బిడ్‌ను ఫాక్స్‌కాన్ హాన్ హై టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆహ్వానించిందని కంపెనీ తరపున చెప్పబడింది. ఈ నెల ప్రారంభంలో ఫాక్స్‌కాన్ భారతదేశంలో చిప్ ప్యాకేజింగ్, టెస్టింగ్ వెంచర్‌ను ప్రారంభించడానికి భారతదేశానికి చెందిన హెచ్‌సిఎల్ గ్రూప్‌తో భాగస్వామ్యం కలిగి ఉందని వార్తలు వచ్చాయి. తైవాన్ కాంట్రాక్ట్ తయారీదారు యూనిట్ ఫాక్స్‌కాన్, హాన్ హై టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ జాయింట్ వెంచర్‌లో 40 శాతం వాటా కోసం 37.2 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది.

## 2024లో మార్కెట్‌లోకి ప్రీమియం బైక్స్ క్యూ.. ఇక రయ్‌రయ్‌మంటూ దూసుకుపోవడమే..!

భారతదేశంలో బైక్స్ ఉన్న క్రేజ్ వేరు. ఇటీవల కాలంలో యువత ఎక్కువగా నయా ఫీచర్స్‌తో వచ్చే ప్రీమియం బైక్స్‌ను అమితంగా ఇష్టపడుతున్నారు.

అయితే ధర కాస్త ఎక్కువగా ఉన్నా అవి అందించే కంఫర్ట్ ముందు మిగిలిన విషయాలేమి ఆలోచించడం లేదు. ముఖ్యంగా 2024లో ప్రీమియం బైక్స్ భారత మార్కెట్‌లోకి క్యూ కట్టాయి. సూపర్ లుక్స్‌తో పాటు ఫీచర్స్‌పరంగా కూడా ఈ బైక్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రీమియం బైక్స్ గురించి మరిన్ని వివరాలను ఓ సారి తెలుసుకుందాం. రాయల్ ఎన్‌ఫీల్డ్ షాట్‌గన్ 650 బైక్‌ను గతేడాది నిర్వహించిన మోటోవర్స్ ఫెస్టివల్‌లో రిలీజ్ చేసింది.

షాట్‌గన్ 648 సీసీ సమాంతర ట్విన్ మోటార్‌తో 47హెచ్‌పీ, 52.3 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 795 ఎంఎం సీటు ఎత్తు, తక్కువ వీల్‌బేస్ మరియు 240 కేజీల బరువుతో, షాట్‌గన్ అందరినీ ఆకర్షిస్తుంది. 13.8 లీటర్ ఇంధన ట్యాంక్‌తో లాంగ్ రైడింగ్‌కు వెళ్లేవారికి అనువుగా ఉంటుంది. ట్రిప్పర్ నావిగేషన్,



డ్యూయల్-ఛానల్ ఏబీఎస్‌తో కూడిన షాట్‌గన్‌ని సింగిల్-సీటర్‌గా లేదా పిలియన్ సీటుతో కొనుగోలు చేయవచ్చు. ఈ స్కూటర్ ధర రూ. 3.59 లక్షల నుంచి రూ. 3.73 లక్షల మధ్య ఉంటుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ షాట్‌గన్ 650 బైక్‌ను గతేడాది నిర్వహించిన మోటోవర్స్ ఫెస్టివల్‌లో రిలీజ్ చేసింది.

## ఆరోగ్య బీమా మరింత చౌక జీఎస్టీ తగ్గింపునకు పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు




**న్యూఢిల్లీ :** ఆరోగ్య బీమా, మైక్రోఇన్సూరెన్స్‌పై పన్ను భారం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక వ్యవహారాలపై ఎంపీ జయంత్ సిన్హా నేతృత్వంలో ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ.. హెల్త్ ఇన్సూరెన్స్, మైక్రోఇన్సూరెన్స్‌లపై ప్రస్తుతం పడుతున్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను 18 శాతం దిగువకు చేర్చాలని సిఫార్సు చేసింది. సీనియర్ సిటిజన్ల కోసం ఆరోగ్య బీమా, మైక్రోఇన్సూరెన్స్ ఉత్పత్తులపై జీఎస్టీకి కోత పెట్టాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. 'బీమా పాలసీలపై ముఖ్యంగా ఆరోగ్య, టర్మ్ ఇన్సూరెన్స్ ప్రోడక్ట్స్‌పై జీఎస్టీ రేటును హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉన్నదని కమిటీ భావించింది. ప్రస్తుతం వీటిపై 18 శాతం పన్ను పడుతున్నది. అధిక జీఎస్టీ రేటుతో అధిక ప్రీమియంల భారాన్ని మోయాల్సి వస్తున్నది. దీనివల్ల బీమా పాలసీలకు కొందరు దూరం అవుతున్నారు' అని 'బీమా రంగ నియంత్రణ, పనితీరు సమీక్ష'పై ఇచ్చిన నివేదికలో పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొన్నది. బీమాను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, అందుకే ఆరోగ్య బీమా ఉత్పత్తులపై వర్తిస్తున్న జీఎస్టీ రేట్లను, ముఖ్యంగా వృద్ధుల కోసం రిటైల్ పాలసీలపై, మైక్రోఇన్సూరెన్స్-టర్మ్ పాలసీలపై పన్ను భారాన్ని తగ్గించాలన్నది.

ప్రభుత్వ బీమా సంస్థలపై..

ప్రభుత్వ రంగానికి చెందిన నాలుగు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, వాటిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని కమిటీ ఈ సందర్భంగా చెప్పింది. ఆయా సంస్థలు మూలధన కొరతను ఎదుర్కొంటున్నాయన్నది. దివాలా ముప్పు పొంచి ఉన్నట్టు తెలిపింది. 2016-17 నుంచి 2020-21 వరకు ఐదేండ్లలో రూ.26,000 కోట్ల నష్టాలను చూసినట్టు వివరించింది. దీంతో ఈ నష్టాల ఊబిలో నుంచి కంపెనీలను బయటపడేసేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలనూ పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది.

మైక్రోఇన్సూరెన్స్‌పై..

సమాజంలో ఆరోగ్య, జీవిత, పంటలు తదితర అంశాలకు సంబంధించి ఇబ్బందులు పడుతున్న పేద, అల్పాదాయ వర్గాల భద్రత, ఆర్థిక రక్షణ కోసం మరిన్ని కొత్త మైక్రోఇన్సూరెన్స్ ఉత్పత్తులను తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఇందుకు రూ.100 కోట్ల మూలధన నిల్వల అవసరం ఉండొచ్చని అంచనా వేసింది. మోటర్ ఇన్సూరెన్స్‌కు ప్రాధాన్యతనిచ్చేలా ఆర్థిక సంస్థలు తమ రుణాల మంజూరు సమయంలో నిర్ణయాలు తీసుకోవాలని కమిటీ సూచించింది. ఈ మేరకు అటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ, ఇటు బ్యాంకింగ్ రంగ రెగ్యులేటర్ ఆర్బీఐ తగిన చర్యలు చేపట్టాలన్నది.

# అరియానా స్టన్నింగ్ లుక్స్.. చేతిలో ఏంటది?




బిగ్ బాస్ బ్యూటీ అరియానా గ్లోరీ గురించి అందరికీ తెలిసిందే. ఆర్జీవీ ఇంటర్వ్యూతో పాపులారిటీ దక్కించుకున్న ఈ బ్యూటీ.. బిగ్ బాస్ సీజన్ 4 తో ప్రేక్షకులను మరింత ఆకట్టుకుంది. అరియనా ఒక దశలో టైటిల్ ఫేవరేట్ గా ప్రచారమైంది. ముక్కుసూటిగా గేమ్ ఆడి అభిమానులను సొంతం చేసుకుంది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకొచ్చాక అరియానా క్రేజ్ ఓ రేటంజ్ లో పెరిగిపోయింది. అయితే నెట్టింట అరియానా చేసే రచ్చ అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటూ.. ఎప్పటికప్పుడు తన న్యూ లుక్స్ తో ఆకట్టుకుంటోంది. స్టన్నింగ్ అవుట్ ఫిట్లలో ఫొటోషూట్లు చేస్తూ తన ఫాలోవర్స్ ను మరింతగా పెంచుకుంటోంది. బ్యాక్ టు బ్యాక్ గ్లామర్ ఫొటోలను పోస్ట్ చేస్తూ నెట్టింట సెగలు పుట్టిస్తోంది. కిర్రాక్ లుక్స్ తో కుర్రాళ్లను మంత్రముగ్ధులను చేస్తోంది.


# తపస్సుగా భావిస్తే తప్ప సాధ్యంకాదు



'భార్యాభర్తల మధ్య కూడా మనస్పర్థలు సహజం. చిరంజీవికీ, నాకూ మధ్య తలెత్తింది అలాంటివే. నిజానికి అప్పుడేం జరిగిందో కూడా నాకు గుర్తులేదు' అన్నారు ప్రఖ్యాత రచయిత యండమూరి వీరేంద్రనాథ్. ఆయన చిరంజీవి జీవిత చరిత్ర రాయనున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్వయంగా చిరంజీవే మీడియా సాక్షిగా ప్రకటించారు కూడా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి యండమూరి ప్రస్తావించారు. 'చిరంజీవితో నా బంధం ఈనాటిది కాదు. 42ఏళ్ల నాటిది. ఆయన 'మంచుపల్లకి' సినిమాకు మాటలు రాశాను. అప్పటినుంచి ఇప్పటివరకూ మా స్నేహం కొనసాగుతూనే ఉంది. సుదీర్ఘమైన ప్రయాణాల్లో కుదుపులు సహజం. మా మధ్య ఏర్పడిన మనస్పర్థలు కూడా అలాంటివే. ప్రస్తుతమైతే మా మధ్య ఎలాంటి విభేదాలూ లేవు' అని తెలిపారు యండమూరి. ఇంకా మాట్లాడుతూ 'నాలుగేళ్ల తర్వాత చిరంజీవిని కలిశాను. ఎలా రిసీవ్ చేసుకుంటారోనని భయపడ్డాను. కానీ ఆయన ఎంతో ప్రేమగా ఆప్యాయంగా పలకరించారు. నిజానికి చిరంజీవి జీవిత చరిత్ర రాయాలనే ఆలోచన నాకు చాలాకాలంగా ఉంది. ఆ వేదికపైనే నా అభిప్రాయాన్ని ఆయనకు చెప్పేశాను. ఆయన ఆశ్చర్యపోయారు. నావైపు సంభ్రమంగా చూస్తూ.. 'నిజంగా రాస్తారా.. మీరు రాస్తే అంతకంటే కావాల్సిందేముంది.. ఇక్కడే ప్రకటించమంటారా?..' అని అడిగేశారు. నేను సరే అనగానే.. ఆయన స్టేజ్‌పై ఆ విషయాన్ని ప్రకటించేశారు' అంటూ ఆనందం వ్యక్తం చేశారు యండమూరి. చిరంజీవి జీవిత చరిత్ర రాయడం చిన్న విషయం కాదని, తపస్సుగా భావించి చేస్తే తప్ప సాధ్యంకాదని యండమూరి తెలిపారు.




# చరిత్రపురుషుడిగా చరణ్?



రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్‌ఛేంజర్' పూర్తిచేసే పనిలోఉన్నారు. ఈ ఏడాది దసరాను టార్గెట్‌గా తీసుకొని చకచకా చిత్రీకరణ జరుపుకుంటున్నదీ సినిమా. ఈ చిత్రం తర్వాత 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించనున్న విషయం తెలిసిందే. 'ఆర్‌సీ16' వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందనుంది. ఇదిలావుంటే.. అప్పుడు 'ఆర్‌సీ17'కు సంబంధించిన న్యూస్ కూడా మీడియాలో తెగ హల్‌చల్ చేస్తుండటం విశేషం. సంజయ్‌లీలా బన్సాలీ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నారట. నిజానికి అల్లు అర్జున్ హీరోగా సినిమా చేసేందుకు సంజయ్ గతంలో ప్రయత్నించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. తాజా సమాచారం మేరకు రామ్‌చరణ్‌తో ఆయన సినిమా సెట్ అయినట్టు వినికిడి. చరణ్ రెండుమూడుసార్లు ఈ మధ్య ముంబయి వెళ్లివచ్చారు. కారణం ఈ సినిమానే అనే టాక్ బలంగానే వినిపిస్తుంది. సంజయ్ హిస్టారికల్స్ తీయడంలో దిట్ట. ఆయన నిర్దేశకత్వంలో వచ్చిన బాజీరావ్ మస్తానీ, పద్మావత్ చిత్రాలు ఘనవిజయాలను నమోదు చేసుకున్నాయి. చరణ్‌తో చేబోతున్న సినిమా కూడా హిస్టారికల్ మూవీనే అని తెలిసింది. శ్రావస్టి సామ్రాజ్యానికి చెందిన ఓ చక్రవర్తి, తన కొద్దిమంది సైన్యంతో ఘాజీ సలార్ మసూద్‌ని ఓడించి మట్టికరిపించిన వీరోచిత గాథ ఆధారంగా ఈ సినిమా రూపొందించనున్నట్టు సమాచారం. బుచ్చిబాబు సినిమా తర్వాత, వెంటనే రామ్‌చరణ్ చేయనున్న సినిమా ఇదే అని వినికిడి. అంటే త్వరలో రామ్‌చరణ్‌ని చరిత్రపురుషునిగా చూడబోతున్నాం అన్నమాట.

# ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఏ. హర్ష దర్శకుడు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'ఏదో ఏదో మాయ..' అంటూ సాగే తొలి గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. రవి బస్రూర్ స్వరపరచిన ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి సాహిత్యాన్నందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ప్రేమించిన అమ్మాయి పట్ల కథానాయకుడి ఆరాధనను ఆవిష్కరిస్తూ చక్కటి భావాలతో ఈ పాట సాగింది. నాయకానాయికలు గోపీచంద్, మాళవిక మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఈ సినిమాలో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ప్రియాభవానీ శంకర్, మాళవిక శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, సంభాషణలు: అజ్జు మహంకాళి, దర్శకత్వం: ఏ.హర్ష.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com